ANN తెలుగు

Follow: @ANNTELUGU

06-11-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 318 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌దే గెలుపు

### గేమ్ ఛేంజర్ సర్వే

**కాంగ్రెస్‌కు 42% నుంచి 46% ఓట్లు**

**బీఆర్ఎస్‌కు 34% - 38% ఓట్లు**

హైదరాబాద్, మహా : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించే అవకాశం ఉందని పొలిటికల్ మేనేజ్‌మెంట్ సంస్థ 'గేమ్ ఛేంజర్ మీడియా బాస్ నెట్‌వర్క్' నిర్వహించిన సర్వే ఫలితాలు స్పష్టం చేశాయి. కాంగ్రెస్‌కు 42% నుంచి 46% ఓట్లు పడే అవకాశం ఉందని సర్వే అంచనా వేసింది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 34% 38% ఓట్లు, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి 12% 16% ఓట్లు పడే అవకాశం ఉందని ఈ సర్వే రిపోర్టు తేల్చింది. సర్వే ప్రకారం ఇతరులకు 04% 08% ఓట్లు షేర్ అవుతాయి. 'గేమ్ ఛేంజర్ మీడియా బాస్ నెట్‌వర్క్' సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, "ఈ సర్వేలో ఓటర్ల అభిప్రాయాలు అత్యంత లోతుగా సేకరించాము. ఈ సర్వేలో సీనియర్ జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లోని అన్ని ప్రాంతాలు, వివిధ వృత్తి వర్గాల నుంచి డేటాను పరిగణనలోకి తీసుకున్నాము. ఫలితాలు ఎన్నికల దిశను సూచిస్తున్నాయి" అని తెలిపారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 5 వరకు నిర్వహించిన ఈ సర్వేలో 6,200 మంది ఓటర్ల అభిప్రాయాల తీసుకున్నట్టు చెప్పారు.

**టాప్ న్యూస్**

### అమ్మకానికి ఐపీఎల్ జట్టు ఆర్సీబీ

- అధికారికంగా ప్రకటించిన యజమాని
- కొనుగోలు రేసులో ప్రముఖులు

02

### ఏ పార్టీతో పొత్తుల్లేవ్



- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే
- అధికార డీఎంకే నే మా ప్రథమ శత్రువు
- స్పష్టం చేసిన టీవీకే చీఫ్ విజయ్

02

### కేసీఆర్ ఎవరి అనుమతి తీసుకుని మిమ్మల్ని రెండుసార్లు అరెస్ట్ చేశారు?



- ఎమ్మెల్యేను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కావాలని ఎక్కడుంది?
- కేసీఆర్ అవినీతి కక్కిస్తామని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిందెవరు?
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

02

# అయ్యా కొడుకులను టచ్ చేసే దమ్ములేదా మోదీ?

- కిషన్ రెడ్డి.. మోదీ ఇంటికి పోయి అడుగు
- నీకు దమ్ముంటే బీజేపీకి డిపాజిట్ తెచ్చుకో
- జూబ్లీహిల్స్ బైపోల్ లో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- కంటోన్మెంట్ ప్రాంతంలో 5 వేల కోట్ల జీవోలు చూపిస్తే కేటీఆర్ పరారైండు
- రాజీనామాకు సిద్ధంగా ఉండు కేటీఆర్
- మోదీ, కేసీఆర్, ఓ వైపు రాహుల్, రేవంత్, అసద్ మరోవైపు
- కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్



హైదరాబాద్,మహా : కాళేశ్వరం కేసు లో సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని, అయ్యా కొడుకులను టచ్ చేసే దమ్ములేదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. బుధవారం షేక్‌పేట, యూసుఫ్ గూడ డివిజన్‌లలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ సీఎం కేసీఆర్‌లు ఇద్దరు ఒక్కటేనని ఎద్దేవా చేశారు. అందుకే కాళేశ్వరం ను ఏటీఎం అన్న నేతలు టచ్ చేయడం లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో అసలు బీజేపీనే లేదని దెప్పిపొడిచారు. ఇక్కడ బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఆరోపించారు.

మిగతా 2లో





### బ్రెజిల్ మోడల్‌కీ హర్యానాలో ఓటు హక్కు

- హర్యానాలో సుమారు 25 లక్షల ఫేక్ ఓట్లు
- డూప్లికేట్, ఫేక్ ఓటర్లతో బీజేపీ విజయానికి ఈసీ సహకరిస్తుంది
- ఓట్ల దొంగలను ఈసీ కాపాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోంది
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో



## అశ్రునయనాల మధ్య గడ్డం అఖిల్ రెడ్డి సంతాప సభ

**పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, బంధుమిత్రులు, సన్నిహితులు**

ఆదిలాబాద్ మహా: ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి సంతాప సభ బుధవారం పట్టణంలోని ప్రజా సేవాభవన్ లో అశ్రునయనాల మధ్య జరిగింది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,బంధుమిత్రులు, సన్నిహితులు అఖిల్ రెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళ్లు అర్పించారు. (పూర్తికథనం 5..లో)

### కార్తీక శోభ.. పోటెత్తిన భక్తులు

శివ నామస్మరణతో మార్మోగిన దేవాలయాలు

02



## కేసీఆర్ ఎవరి అనుమతి తీసుకుని మిమ్మల్ని రెండుసార్లు అరెస్ట్ చేశారు?

- ఎమ్మెల్యేను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కావాలని ఎక్కడుంది?
- కేసీఆర్ అవినీతి కక్కిస్తామని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిందెవరు?
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** కేటీఆర్ అరెస్ట్ విషయంలో రేవంత్ రెడ్డి తీరు ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు వేశారు. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేసేందుకు గవర్నర్ అనుమతి కోరి 2 నెలలైనా స్పందన లేదని, జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు.. కేసీఆర్ కుటుంబ సభ్యులను అరెస్టు చేయవద్దని ఏఐసీసీ పెద్దలు చేసిన సూచన మేరకే వారిని అరెస్టు చేయకుండా అబద్ధాలతో టైమ్ పాస్ చేస్తున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్‌ను ముందు రిమాండ్ చేయాలని ఆ తర్వాత కోర్టులో చూసుకుంటాయన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతిపై ఆధారాలు ఉన్నాక గవర్నర్ అనుమతి పంచాయితీ ఎందుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎమ్మెల్యేను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కావాలని ఎక్కడుంది? ఈ దేశం, రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే అరెస్టు కాలేదా? గత బీఆర్ఎస్ పాలనలో మిమ్మల్ని రెండు సార్లు అరెస్టు చేశారు. నాడు కేసీఆర్ ఎవరి అనుమతి తీసుకుని అరెస్టు చేశారని సీఎంను ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం అవినీతిని కక్కిస్తామని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన 23



నెలల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీని ప్రశ్నిస్తున్నారని రఘునందన్ రావు నిలదీశారు. ఎన్డీఎస్ఏ, పీసీ ఘోష్ కమిషన్ నివేదికను హడావుడిగా అసెంబ్లీలో పెట్టి ఈ కేసును సీబీఐకి పంపితే దీనిపై కేసీఆర్, హరీశ్ రావు, మాజీ సీఎస్ ఎస్.కే జోష్, స్మితా సబర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారని దాంతో వీరందరిపై సీబీఐ విచారణ ఆపాలని హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. మరో రెండు వారాల్లో ఏజీతో కౌంటర్ వేయాలని చెబితే ఇప్పటి వరకు కౌంటర్ వేయించలేదన్నారు. ఏసీబీ కేసులో అరెస్టు చేయించడం చేతకావడం లేదన్నారు. అరెస్టులు చేస్తే ప్రజలు బీఆర్ఎస్‌పై సింపతి చూపుతారేమోనన్న భయంతో అరెస్టు చేయకుండా బీజేపీని ఎందుకు విమర్శిస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చిన రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబం అవినీతిపై ప్రధానికో, కేంద్ర హోంశాఖ మంత్రికో ఫిర్యాదు చేశారా అని మండిపడ్డారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేవంత్ రెడ్డి మెడమీద కత్తిలా వేలాడుతోందని, అందుకే ఆ భయంతోనే ఏది పడితే అది మాట్లాడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం వంగి వంగి దండాలు పెడుతోందని, జై పాలస్తీనా అన్నవారిని తమ వెంట తిప్పుకుంటోందన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి బీసీ కోటాలో ఇచ్చారా లేక మైనార్టీ కోటాలో ఇచ్చారా అని రఘునందన్ రావు ప్రశ్నించారు.

## బ్రెజిల్ మోడల్‌కీ హర్యానాలో ఓటు హక్కు

### హర్యానాలో సుమారు 25 లక్షల ఫేక్ ఓట్లు

- డూప్లికేట్, ఫేక్ ఓటర్లతో బీజేపీ విజయానికి ఈసీ సహకరిస్తుంది
- ఓట్ల దొంగలను ఈసీ కాపాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోంది
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు




**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 25 లక్షల ఫేక్ ఓట్లతో బీజేపీ విజయం సాధించినట్లు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం వైఖరిని ఖండిస్తూ బుధవారం ఆయన ఢిల్లీలో మాట్లాడారు. హర్యానాలో ఉన్న ఓటర్లలో ప్రతి 8 మంది ఓట్లలో ఒకరు నకిలీ ఓటరు ఉన్నట్లు ఆరోపించారు. బీజేపీ విజయం కోసం ఎన్నికల సంఘం సహకరిస్తున్నట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు. డూప్లికేట్, ఫేక్ ఓటర్లతో బీజేపీ విజయానికి ఈసీ సహకరిస్తున్నట్లు విమర్శించారు. ఫేక్ ఓట్లకు సంబంధించిన ఫోటోలు, రికార్డులను ఆయన మీడియాకు చూపించారు. ఫేక్ ఓటర్ల జాబితాలో బ్రెజిల్ దేశ మోడల్ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. రాయ్‌లోని ఓ పోలింగ్ బూత్‌లో ఆ మోడల్ సుమారు 22 సార్లు ఓటు వేసినట్లు రాహుల్ ఆరోపించారు. ఆ మోడల్‌కు చెందిన అఫీషియల్ సోషల్ మీడియా పేజీని కూడా చూపించారు. హర్యానా ఓటర్ల జాబితాలో ఓ మహిళ పేరు 223 సార్లు ఉన్నట్లు మరో ఉదాహరణ ఇచ్చారు రాహుల్. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేతలు.. హర్యానాలో ఓట్లు వేసినట్లు ఉన్నరి కార్డులను కూడా కాంగ్రెస్ నేత మీడియా ముందు ప్రజెంట్ చేశారు.

**ఇది రాజ్యాంగాన్ని చంపడమే..**

ఓటర్ల జాబితా నుంచి డూప్లికేట్ ఓట్లను ఎన్నికల సంఘం ఎందుకు తొలగించడం లేదని, ఎందుకంటే అది బీజేపీ విజయానికి కారణం అవుతుందని రాహుల్ గాంధీ అన్నారు. హర్యానా ఎన్నికల సమయంలో ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్ విజయాన్ని సూచించాయని, కానీ బీజేపీ గెలవడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. హర్యానా ఎన్నికల ఓటర్ల జాబితా నుంచి 3.5 లక్షల ఓట్లను ఈసీ తొలగించిందన్నారు. దీంట్లో చాలా మంది ఓటర్లు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసినట్లు ఆయన తెలిపారు. హర్యానాలో ఎన్నికలు జరగలేదని, అక్కడ దోపిడీ జరిగిందన్నారు. తాను చేస్తున్న ఆరోపణలకు ఈసీ రికార్డులే సాక్ష్యాలు అని, వాటిని చెక్ చేసి, మన ఎన్నికల తీరు ఎలా ఉంటుందో మీకు చూపిస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఇలాంటి వ్యవస్థ పరిశ్రమగా మారిందని, దీన్ని ఇతర రాష్ట్రాల్లో వాడే అవకాశం ఉన్నట్లు ఆరోపించారు. బీహార్‌లోనూ ఇదే జరుగుతుందని, ఈ వ్యవస్థను మార్చలేమని, ఎందుకంటే ఓటర్ల జాబితా చివరి నిమిషంలో తయారవుతుందని, ఇది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని చంపడమే అని ఆయన పేర్కొన్నారు.

## అయ్యా కొడుకులను టచ్ చేసే దమ్ము లేదా మోదీ?



(మొదటిపేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సెంటిమెంట్ పనికి రాదని విమర్శించారు. ఒకవేళ సెంటిమెంట్ అయితే పీజేఆర్‌పై పోటీ పెట్టింది బీఆర్ఎస్ కాదా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు సీఎం రేవంత్‌రెడ్డి.మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ అభివృద్ధిపై చర్చలకు రావాలని సవాల్ విసిరారని.. ఆయనకు సవాల్ విసరడం, పారిపోవడం అలవాటేనని సెటైర్లు గుప్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తాను సవాల్ విసిరితే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయన మా ఇంటికి వస్తా చర్చిద్దాం అంటున్నారని, మా ఇంటికి కాదు మోదీ ఇంటికి పోయి అయ్యాకొడుకులను ఎందుకు కాపాడుతున్నరో అడుగాలని సూచించారు. పదేళ్లుగా బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌కి ఏం ఇచ్చిందని నిలదీశారు. తాను మొదటి నుంచి సెక్యులర్ భావాలు ఉన్న వ్యక్తినని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పాలనలోనే మైనార్టీలకు అనేక అవకాశాలు వచ్చాయని నొక్కిచెప్పారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కిషన్‌రెడ్డి అడుగుతున్నారని అన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వకూడదో కిషన్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని అభివర్ణించారు. తాను మూడుసార్లు ఆయా ఎన్నికల్లో గెలవడానికి మైనార్టీల సహకారం ఉందని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో సమస్యలకు కారణం బీఆర్ఎస్, బీజేపీ కాదా..? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని మాటిచ్చారు. జూబ్లీహిల్స్‌లో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**నవీన్ విజయానికి ఎంఐఎం నేతలు కృషి**

కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరితే మోదీ ఎందుకు పట్టించుకోవడం లేదని సీఎం ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, కేటీఆర్‌లపై కూడా ఆయన నిప్పులు చెరిగారు. కంటోన్మెంట్ ఏరియాలో రూ. 5000 కోట్ల జీవోలు చూపిస్తే కేటీఆర్ పారిపోయారని.. రాజీనామాకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. నవీన్ యాదవ్ విజయం కోసం ఎంఐఎం నేతలు కృషి చేస్తున్నారని.. ఆయనకు మొదట ఎంఐఎం టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో హిందూ, ముస్లింల మధ్య తారతమ్యం లేదని.. సిరాజ్, నిఖత్ జరీన్, అజరుద్దీన్‌లకు అవకాశాలిచ్చామని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ రహస్య అవగాహనతో ఉన్నాయని ఆరోపించారు. నవీన్ యాదవ్‌ను 30 వేల మెజారిటీతో గెలిపించాలని కోరుతూ.. జూబ్లీహిల్స్‌లో మోదీ, కేసీఆర్ ఒక వైపు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, అసదుద్దీన్ మరోవైపు ఉన్నారని అన్నారు. జూబ్లీహిల్స్‌లో 'జై కాంగ్రెస్' నినాదం వినిపిస్తుంటే.. ఫామ్‌హౌస్‌లలో నిద్రపోతున్న గుండెలు అదురుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పొన్నం ప్రభాకర్ గౌడ్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ వంటి నాయకులు ఈ విజయంలో భాగస్వాములయ్యారని తెలిపారు. వివేక్ ఆధ్వర్యంలో షేక్‌పేట లో పెద్ద ఎత్తున డెవలప్ మెంట్ పనులు మొదలు పెట్టామన్నారు.

## అమ్మకానికి ఐపీఎల్ జట్టు ఆర్సీబీ

**అధికారికంగా ప్రకటించిన యజమాని**

కొనుగోలు రేసులో ప్రముఖులు

**మహా:** ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అమ్మకానికి రానుంది. ఈ ఫ్రాంచైజీ యజమాని, ప్రముఖ ఆల్కహాల్ బేవరేజ్ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్) ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. తమ ప్రధాన వ్యాపారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. ఆర్సీబీ జట్టును నిర్వహిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌సీఎస్‌పీఎల్), యూఎస్ఎల్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా ఉంది. ఈ పెట్టుబడిపై వ్యూహాత్మక సమీక్ష చేపడుతున్నట్లు యూఎస్ఎల్ తెలిపింది. దీని ప్రకారం, 2026 మార్చి 31 నాటికి ఈ అమ్మకం ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ నిర్ణయం పురుషుల ఐపీఎల్ జట్టుతో పాటు, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) జట్టుకు కూడా వర్తిస్తుంది. ఆర్సీబీని కొనుగోలు చేసేందుకు పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. వీరిలో అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు చెందిన జిందాల్స్, సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అదార్ పూనావాలా, దేవయాని ఇంటర్నేషనల్ గ్రూప్ చైర్మన్ రవి జైపూరియాతో పాటు అమెరికాకు చెందిన ఒక ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

## కార్తీక శోభ.. పోటెత్తిన భక్తులు

**శివ నామస్మరణతో మార్మోగిన దేవాలయాలు**



**మహా నెట్ వర్క్:** కార్తీక పౌర్ణమి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయాలకు పోటెత్తారు. శైవ క్షేత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారి ఆలయాల్లో కుంకుమార్చనలతోపాటు భక్తులు దీపాలు వెలిగించారు. దాంతో దేవాలయాల ప్రాంగణాలన్ని దీపాలతో నిండిపోయాయి. ముఖ్యంగా శ్రీశైలంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంభ దేవీకి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమార్చన పూజలు జరిపి, ఉసిరి చెట్టుకు మహిళలు పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. శివాలయంలో పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ఇక శివనామస్మరణ చేస్తూ 365 ఒత్తులతో భక్తులు దీపారాధన చేశారు. కార్తీక పౌర్ణమి వేళ.. పరమ శివునికి దీపారాధన జరిపితే పుణ్యం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఇక తెలంగాణలోని వరంగల్ భద్రకాళి, వేములవాడ రాజన్న, భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ద్రాక్షారామం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి, అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి, సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి, మహానంది, అన్నవరం తదితర దేవాలయాల్లో భక్తుల రద్దీ ఈ రోజు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు కొనసాగింది. గోదావరి నదీలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులతో రాజమండ్రిలోని పుష్కర ఘాట్, కోటి లింగాల రేవు, ఇటు కోవ్వూరులోని గోష్పాద క్షేత్రం నిండిపోయాయి. ఇక విజయవాడలోని కృష్ణానది తీరంలో సైతం భక్తులు పుణ్య స్నానం ఆచరించారు. అందుకోసం ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. ఇక మచిలీపట్నంలోని సముద్ర స్నానానికి భక్తులు పోటెత్తారు. దాదాపు లక్ష మంది ఈ స్నానం ఆచరించినట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణలోని హనుమకొండ రుద్రేశ్వర స్వామి సిద్ధేశ్వర స్వామి ఆలయం, కాళేశ్వరం, రామప్ప, పాలకుర్తి సోమేశ్వర స్వామి ఆలయం, కురవి వీరభద్ర స్వామి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. శ్రీకాళహస్తిలో స్వామి వారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలి వచ్చారు. అయితే పలు ఆలయాల్లో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.




## రేవంత్ రెడ్డికి మేమెందుకు భయపడతాం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, మహా:** తాను ఎలాంటి తప్పు చేయలేదని, అలాంటప్పుడు రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తికి ఎందుకు భయపడతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి తాను 30 ఫీట్లు ఉన్నట్లుగా డైలాగులు కొడతాడని విమర్శించారు. ఆయన ఏదో పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తనను తాను అంతకంటే ఎక్కువగా ఊహించుకోవద్దని సూచించారు. తమపై పెట్టే ఉత్తి కేసులు నిలబడవని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక నివేదికను విడుదల చేశారు. 'జూబ్లీహిల్స్ ప్రగతి నివేదిక' పేరుతో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా, గత రెండేళ్లలో నగరంలో ఒక్క ఫ్లైఓవర్ అయినా నిర్మించారా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే రేవంత్ రెడ్డి ఈరోజు కూర్చుని మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్ నగరాన్ని అత్యంత భద్రత కలిగిన నగరంగా బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చిదిద్దిందని అన్నారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో క్రైమ్ రేటు 41 శాతం, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 60 శాతం పెరిగిందని ఆయన ఆరోపించారు.

## ఏ పార్టీతో పొత్తుల్లేవ్..

**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే.. అధికార డీఎంకే నే మా ప్రథమ శత్రువు.. స్పష్టం చేసిన టీవీకే చీఫ్ విజయ్**

**చెన్నై, మహా :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తమిళగ వెట్రి కజగం (టీవీకే) విజయ్ స్పష్టం చేశారు. టీవీకే పార్టీ బీజేపీతో పొత్తుపెట్టుకుంటుందని, ఏఐఏడీఎంకేతో కలిసి పోటీ చేస్తుందని వస్తున్న వార్తలకు ఈ ప్రకటనతో విజయ్ ఫుల్‌స్టాప్ పెట్టారు. చెన్నై సమీపంలోని మహాబలిపురంలో జరిగిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కరూర్ తొక్కిసలాటకు ప్రభుత్వమే కారణమని, తమ రాజకీయ మొదటి ప్రత్యర్థి కూడా అధికార డీఎంకేనని చెప్పారు. కరూర్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన 38 రోజుల తర్వాత విజయ్ తొలిసారి బహిరంగంగా కనిపించారు. టీవీకేకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే అధికార పార్టీ "ప్రైవేట్ సైన్యాన్ని" ఏర్పాటు చేసిందని ఘాటుగా ఆరోపించారు.

**టీవీకే తీర్మానాలు ఇవే**

టీవీకే సర్వసభ్య సమావేశం 12 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. 2026 అసెంబ్లీ ఎన్నికలతో పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్ పేరును ప్రకటించారు. శ్రీలంక నావికాదళం తమిళనాడు మత్స్యకారులను పదే పదే అరెస్టు చేయడాన్ని నిలిపివేయాలని, కోయంబత్తూరు గ్యాంగ్ రేప్ ఘటన నేపథ్యంలో మహిళల భద్రతకు మెరుగైన చర్యలు, ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ని నిలిపివేయాలని, విజయ్, టీవీకే కార్యక్రమాలకు తగిన పోలీసు భద్రత కల్పించాలని తీర్మానించారు. విజయ్ తన ప్రసంగంలో స్టాలిన్‌ను తీవ్రంగా విమర్శించారు. ఆయన 'రాజకీయ దురుద్దేశం'తో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ర్యాలీ సందర్భంగా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించిందని గుర్తుచేశారు. "భారతదేశంలో, ఏ రాజకీయ నాయకుడికీ ఇంత కఠినమైన నిబంధనలు పెట్టలేదు. ర్యాలీ సమయంలో బస్సులకే పరిమితం కావాలని,



జనాలకు చేయి ఊపకూడదని, వాహనాలపైకి ఎక్కకూడదని ఇలా ఎన్నో కండీషన్లు పెట్టడం వెనక రాజకీయ దురుద్దేశం ఉంది'' అని పేర్కొన్నారు.

## అలా అయితే థియేటర్లు ఖాళీ అవుతాయ్

**టికెట్, స్నాక్స్ ధరలపై సుప్రీంకోర్టు సీరియస్**

**నీళ్ల బాటిల్‌కు రూ.100.. కాఫీకి 700 వసూలు చేస్తారా అని అసంతృప్తి**

**ఢిల్లీ, మహా:** మూవీ టికెట్‌తో పాటు థియేటర్లలో తినుబండారాల ధరలు భారీగా పెరగడంపై సుప్రీంకోర్టు సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఒక సినిమాకి రూ.1500 నుంచి రూ.2000 వరకు ఖర్చవుతుంది. ధరలను నియంత్రించకపోతే సినిమా హాళ్లు త్వరలోనే ఖాళీగా మారే ప్రమాదం ఉంది అని కోర్టు పేర్కొంది. కర్ణాటకలో మూవీ టికెట్ ధరను రూ.200 కు పరిమితం చేయడంపై మల్టీప్లెక్స్ అసోసియేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఈ విధంగా స్పందించింది. మల్టీప్లెక్స్‌లు సినిమా టిక్కెట్లతో పాటు ఆహారం, పానీయాలకు వసూలు చేస్తున్న అధిక ధరలపై సుప్రీంకోర్టు సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రేక్షకులు థియేటర్లను సందర్శించడం కొనసాగించడానికి ధరలను సహేతుకంగా ఉంచాలని పేర్కొంది.

**ఒక్క నీళ్ల బాటిల్‌కు రూ.100, కాఫీకి రూ.700 వసూలు చేస్తారా?**

కర్ణాటక హైకోర్టు విధించిన కొన్ని షరతులను సవాలు చేస్తూ, మల్టీప్లెక్స్ టిక్కెట్ల ధరలను ₹200కి పరిమితం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేస్తూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ విక్రమ్ నాథ్ మరియు జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా, జస్టిస్ నాథ్ మల్టీప్లెక్స్‌లలో అమ్మకపు వస్తువుల అధిక ధరలపై వ్యాఖ్యానించారు. "మీరు వాటర్ బాటిల్‌కు 100 రూపాయలు, కాఫీకి 700 రూపాయలు వసూలు చేస్తారు" అని ఆయన చెప్పినట్లు లైవ్ లా పేర్కొంది. ''రేట్లను నిర్ణయించాలి. సినిమా రేట్లు తగ్గుతున్న కొద్దీ, ప్రజలు వచ్చి ఆనందించడానికి మరింత సహేతుకంగా చేయండి, లేకుంటే సినిమా హాళ్లు ఖాళీగా ఉంటాయి" అని అన్నారు.







# ప్రభుత్వ సలహాదారుగా పి.సుదర్శన్ రెడ్డి బాధ్యతలు

హైదరాబాద్, మహా: తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా పి. సుదర్శన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం సుదర్శన్ రెడ్డికి సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఛాంబర్ కేటాయించింది. తన ఛాంబర్‌లో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య, కుటుంబ సభ్యులు, అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సుదర్శన్ రెడ్డికి అభినందనలు తెలిపారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ హృదయపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సెక్రటేరియట్‌లోని వారి కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలియజేశారు.

# రాష్ట్ర ఖజానాకు కాసుల గల గల

## జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ ముందంజ.. 10 శాతం వృద్ధి, దేశంలోనే టాప్ సెకండ్ స్టేట్‌గా రికార్డ్

హైదరాబాద్, మహా : సవరించిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల కారణంగా వస్తువుల ధరలు దిగివచ్చాయి. కొన్ని వస్తువులపై జీఎస్టీని పూర్తిగా తొలగించగా మరికొన్నింటి శ్లాబులు తగ్గించారు. అయితే దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు తగ్గుతాయని నష్టాలు కూడా వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేశారు. అయితే జీఎస్టీ పన్ను రేట్లు తగ్గినా.. వసూళ్లు మాత్రం తగ్గట్లేదు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ వల్ల లబ్ధి పొందిన అతిపెద్ద రాష్ట్రాలలో తెలంగాణ ఒకటిగా నిలిచింది. తాజా 'ఎకోరాప్' నివేదిక ప్రకారం.. జీఎస్టీ వసూళ్లలో అనూహ్య వృద్ధిని నమోదు చేసి దేశంలోనే రెండో స్థానం దక్కించుకుంది. జీఎస్టీ రేట్ల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఆదాయంలో 7 శాతం నష్టాన్ని అంచనా వేసిన తెలంగాణ రాష్ట్రం..దానికి భిన్నంగా 10 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2025 అక్టోబర్ నెలలో తెలంగాణ జీఎస్టీ ద్వారా రూ. 5,726 కోట్లు వసూలు చేసింది. ఇది అంతకు ముందు సంవత్సరం (2024 అక్టోబర్) వసూలు చేసిన రూ.5,211 కోట్లతో పోలిస్తే 10 శాతం అధికం. రాష్ట్రం అంచనా వేసిన నెలవారీ



రూ. 583 కోట్ల నష్టానికి బదులు.. ఏకంగా రూ.783 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఎకోరాప్ నివేదిక ప్రకారం.. 202526 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ 8-9 శాతం వార్షిక జీఎస్టీ వృద్ధి రేటును నమోదు చేసే అవకాశం ఉంది. ఈ జాబితాలో కర్ణాటక 10 శాతం వృద్ధితో అగ్రస్థానంలో నిలవగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా తెలంగాణకు సమానంగా 8-9శాతం వృద్ధిని సాధిస్తుందని అంచనా. కర్ణాటక రాష్ట్రం నెలవారీ రూ. 7,083 కోట్ల నష్టాన్ని అంచనా వేసినా అది కూడా 10 శాతం వృద్ధిని చూసింది. పంజాబ్ 4 శాతం వృద్ధిని నమోదు చేసింది. పశ్చిమ బెంగాల్‌లో స్వల్పంగా 1 శాతం క్షీణత కనిపించగా కేరళలో జీఎస్టీ ఆదాయం 2 శాతం తగ్గింది.

**బడ్జెట్ అంచనాలను మించే అవకాశం**

జీఎస్టీ కౌన్సిల్ డేటా ప్రకారం ధరల సవరణల తర్వాత చాలా రాష్ట్రాలు సానుకూల వృద్ధిని కనబరిచాయి. దేశీయ జీఎస్టీ వసూళ్ల అంచనాల ఆధారంగా చూస్తే రాష్ట్రాలు అక్టోబర్ 2025లో చూపిన వృద్ధిని ఇలాగే కొనసాగిస్తే 202526 ఆర్థిక సంవత్సరానికి మొత్తం జీఎస్టీ ఆదాయాలు కేంద్ర బడ్జెట్‌లో అంచనా వేసిన ప్రొజెక్షన్లను మించిపోయే అవకాశం ఉందని ఎకోరాప్ నివేదిక పేర్కొంది. గతంలో 2018 జూలై, 2019 అక్టోబర్ నెలల్లో జీఎస్టీ రేట్ల మార్పుల తర్వాత కూడా స్వల్ప సర్దుబాటు దశ అనంతరం ఆదాయాలు నెలవారీ 56 శాతం వృద్ధి చెందాయని నివేదిక గుర్తు చేసింది. ప్రస్తుత రేట్ల తగ్గింపు వల్ల స్వల్పకాలంలో 3-4 శాతం క్షీణత ఉన్నప్పటికీ.. మొత్తం జీఎస్టీ పన్ను పరిధిని బలోపేతం చేసిందని, భవిష్యత్తులో స్థిరమైన వృద్ధికి ఇది మార్గం సుగమం చేస్తుందని నివేదిక వెల్లడించింది.

# టెన్త్ విద్యార్థులకు బండి సంజయ్ నజరానా

- ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే 12 వేల మంది విద్యార్థులకు "మోదీ గిఫ్ట్" పేరుతో ఎగ్జామ్ ఫీజును చెల్లిస్తానని ప్రకటన
- ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాసిన బండి సంజయ్



కరీంనగర్, మహా : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభవార్త తెలిపారు. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతీ శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులు సహా దాదాపు 20 వేల మందికి "మోదీ గిఫ్ట్" పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోదీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ ను పంపిణీ చేయబోతున్నారు.

# ఎన్డీఏ కోటి వరాల హామీలు బూటకం

## ఒక్కసారి మహాగఠ్ బంధన్‌కు అవకాశం ఇవ్వండి

తెలంగాణ మోడల్ పాలన అందిస్తాం.. బీహార్ ప్రజలకు మంత్రి పొంగులేటి పిలుపు

కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో కలిసి బీహార్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి



పాట్నా, మహా : రెండు దశాబ్దాల పాటు అవినీతి అక్రమాలు అవకాశవాద రాజకీయాలతో బీహార్ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని బీహార్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపారన్ జిల్లా చనుపటియా అసెంబ్లీ నియోజకవర్గం లో బుధవారం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో కలిసి మంత్రి పొంగులేటి ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్డీయే కూటమికి ఓటమి భయం పట్టుకుందని అందువల్లే అలవికాని హామీలను ఇస్తుందని విమర్శించారు. వారి ఎన్నికల ప్రణాళికలో కోటి వరాలు ప్రకటించడం, యువతకు కోటి ఉద్యోగాలు, కోటి మంది లక్‌పతి దీదీలు హామీలు ఇచ్చారని అధికారంలో ఉన్న ఈ 20 సంవత్సరాలలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు, ఎంతమంది దీదీలను లక్ పతులుగా చేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు వీటిని అమలు చేయలేదని ప్రశ్నించారు. బీహార్ ప్రజలను కొత్త కొత్త హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహాగఠ్ బంధన్‌ను గెలిపిస్తే తెలంగాణ మోడల్ పాలనను బీహార్‌లో అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని వివరించారు. రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. బీహార్ ప్రజలు ఈ సారి విజ్ఞతతో ఆలోచించి మహాగఠ్ బంధన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మహాగఠ్ బంధన్‌ను గెలిపిస్తే యువకుడైన తేజస్వియాదవ్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయాన్ని ప్రకటించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. ఈ సభలో బీహార్ రాష్ట్ర ఇంచార్జ్ కృష్ణ అల్వార్, ఎంజీబీ అభ్యర్థి అభిషేక్ రంజన్ తదితరులు పాల్గొన్నారు



## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడి

# కుషాయిగూడలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

హైదరాబాద్, మహా : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ ఆటో డ్రైవర్ పోలీసు స్టేషన్ ముందే ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికంగా కలకలం సృష్టించిన ఈ ఘటన మల్కాజిగిరి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఆటో డ్రైవర్ గా పని చేస్తున్న సింగిరెడ్డి మీన్ రెడ్డి (32) డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. దీంతో పోలీసులు ఆటోను పోలీసుస్టే,న్ కు తరలించారు. దమ్మాయిగూడకు చెందిన మీన్ రెడ్డి ఆటోను వదిలేయాలంటూ రాత్రి పొద్దుపోయేంత వరకు పోలీసులను వేడుకున్నాడు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్ ఎదుటే మీన్ రెడ్డి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలను ఆర్పడానికి స్థానికులు ప్రయత్నించినప్పటికీ మీన్ రెడ్డి 90 శాతం కాలినగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం గాంధీ తరలించగా అక్కడ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మల్కాజ్ గిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ అంటేనే కరెంట్... కరెంట్ అంటేనే కాంగ్రెస్

- కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదన్న వారు ముట్టుకుంటే తెలుస్తుంది
- పరిగి నియోజకవర్గం లో వెయ్యి కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు
- పరిగిలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



పరిగి, మహా : కాంగ్రెస్ అంటేనే కరెంటు, కరెంటు అంటేనే కాంగ్రెస్ అని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదన్న వారు కరెంటుతో పాటు కాంగ్రెస్ ను ముట్టుకుంటే తెలుస్తుందని ష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. బుధవారం పరిగి నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న భట్టి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. రాష్ట్రంలో 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ను 53 లక్షల కుటుంబాలకు అందజేస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లాలో 2 లక్షల 47 వేల 777 కుటుంబాలంటే నిరుపేదలైన 1 లక్ష 43 వేల 190 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు . ఒక్క పరిగి నియోజకవర్గంలోనే 44,500 కుటుంబాలకు గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ ను అందిస్తున్నామన్నారు. ప్రతి నెల గృహ జ్యోతి పథకం కోసం ప్రభుత్వం 2830 కోట్ల రూపాయలను విద్యుత్ శాఖకు చెల్లిస్తుందన్నారు. పరిగి నియోజకవర్గంలో వెయ్యి కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులను మంజూరు చేశామన్నారు. నియోజకవర్గానికి 9 సబ్ స్టేషన్ లతోపాటు 33/11 కెవి, 400 కేవీ సబ్ స్టేషన్ తో పాటు 220 కెవి సబ్ స్టేషన్ ను మంజూరు చేశామన్నారు పరిగి నియోజకవర్గ అభివృద్ధి కోసం రామ్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. నా వెల్ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు వేల కోట్ల సాధన కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని, అయితే గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు పట్టించుకోలేదన్నారు. డిఫెన్స్ కు సంబంధించి 3000 కోట్లు రావడం ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో పరిగి నియోజకవర్గంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి కోసం విద్యుత్తు సబ్ స్టేషన్ లు పెద్ద ఎత్తున మంజూరు చేశామని వాటికి భూమి పూజ కూడా చేశామన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆయా కుటుంబాలు అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మన్నెగూడ నుంచి బీజాపూర్ వరకు రోడ్డు మంజూరు అయిందని, అయితే గతం పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం



రోడ్డు వేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్జీటీ 2 లో ఉన్న కేసును గత నెల 30న తొలగించడం కోసం కృషి చేయడం వల్ల నాలుగు లైన్ల రహదారి పనులు వడివడిగా నడుస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ మూడెకరాల భూమి ఇంటికో ఉద్యోగం, బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిందని అందులో ఒక్కటైనా అమలైందా అని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టు కడతామని చెప్పి మోసం చేసిందని, కృష్ణనదిపై ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని, గోదావరిపై లక్ష కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు సంగతి ఏమైందో ప్రజలందరికి తెలుసు అన్నారు . యూపీఏ ప్రభుత్వ హయాంలో వంద రోజులు ఉపాధి పనులను మాత్రమే గత ప్రభుత్వం గ్రామాలలో చేపట్టినప్పుడు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు కొబ్బరికాయలు కొట్టి ఫోటోలు దిగారని, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు చేసే పనిని వాళ్ళు చేశారని ఎద్దేవా చేశారు.

**విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట**

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వారానికి మూడు రోజులు ప్రజాబాట నిర్వహించబోతుందన్నారు. తెలిపారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులే ప్రజల వద్దకు వెళ్తారని అంబులెన్స్ లాగా ఒక వాహనం కూడా ఉంటుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచబోతున్నామన్నారు.

# బీజేపీకి బీఆర్ఎస్ తాకట్టు..

- పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది చోట్ల డిపాజిట్ రాలే
- బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని బీజేపీకి అవయవ దానం చేసింది
- ఆ రెండు పార్టీల మధ్య రాజకీయ ఒప్పందంతోనే కేసులపై చప్పుడు లేదు
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాబోతుందని కవితనే చెప్పారు కదా?
- బీఆర్ఎస్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్



హైదరాబాద్, మహా: బీఆర్ఎస్ పార్టీని ఆ పార్టీ అధినేత కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎనిమిది చోట్ల డిపాజిట్ రాలేదని, బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని బీజేపీకి అవయవ దానం చేసిందని సెటైర్లు వేశారు. బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంత రావు, శ్రీ గణేష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి పాస్టర్స్ తీసుకురాగా.. రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్ జోడో పాదయాత్ర ద్వారా రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. మోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ ప్రమాదకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లే కామెంట్స్ చేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్య పెట్టడానికి కుట్ర జరుగుతోందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు స్పందించలేదని అన్నారు. ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఇప్పటి వరకు అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు? అని ప్రశ్నించారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావును మాత్రం విచారణ కు పిలవడం లేదని, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని, గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారన్నారు. కేసీఆర్ మంత్రి వర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నాడని, తమ మంత్రి వర్గంలో నలుగురు దళితులకు మంత్రులుగా అవకాశం కల్పించామన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ కి అవకాశం ఇచ్చామని, అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానమని అన్నారు.

# రాష్ట్రంలో నాలుగు లక్షల 50వేల ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం

గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని చెప్పి ఏ ఒక్క నిరుపేదకు ఇల్లు కట్టించి ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసి ప్రతి ఇంటికి 5 లక్షల చొప్పున కేటాయించామని, రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 93 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షలతో ఈ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేస్తున్నామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న అప్పటి ప్రభుత్వం గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించలేదని, రాష్ట్రం కోసం పోరాడిన నిరుద్యోగులకు వయసు మీరిపోతున్న వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను కల్పించిందని, కొందరు గ్రూప్ 1 అడ్డుకోవాలని చూస్తే, కోర్టుకు వెళ్లి వారికి నియామక పత్రాలను అందజేశామన్నారు. తెలంగాణలో కేవలం సంక్షేమం కోసమే 1 ఒక లక్ష 600 వేల 310 కోట్ల ను ఖర్చు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేశామని ఒక్కొక్క స్కూలు 25 ఎకరాలలో 200 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు.

EDITORIAL
సంపాదకీయం

# అడవి నుండి అంతర్జాతీయ వేదికపై మంత్రి సీతక్క స్ఫూర్తిదాయక జీవితగాథపై ప్రశంసలు

(మహా నెట్ వర్క్)

అంతర్జాతీయ వేదికపై తెలంగాణ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలంగాణ స్ఫూర్తిని ప్రతిధ్వనింపజేశారు. నెదర్లాండ్స్‌లో జరిగిన మహిళా నాయకత్వ సదస్సు 'వైటల్ వాయిసెస్ గ్లోబల్ ఫెలోషిప్ గ్లోబల్ సమ్మిట్'లో "ప్రతికూలతల నుంచి సాధికారతవైపు దేశాలను మారుస్తున్న మహిళల శక్తి" అనే అంశంపై సీతక్క ప్రసంగం అక్కడి శ్రోతలందరినీ ఆకట్టుకుంది. తన చిన్ననాటి ఆదివాసీ బాలిక జీవితం నుండి రాష్ట్ర మంత్రిగా ఎదిగిన ప్రేరణాత్మక ప్రయాణాన్ని, ఆ మార్గంలో సమాజానికి అందించిన సేవలను, ప్రజాస్వామ్య పోరాటాలను, కరోనా కాలంలో చేసిన సహాయ కార్యక్రమాలను సీతక్క వివరించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ "నేను తెలంగాణలోని చిన్న ఆదివాసీ గిరిజన గ్రామంలో పుట్టాను. పేదరికం, అసమానతలు నా బాల్యాన్ని మలిచాయి. 16 ఏళ్ల వయసులో న్యాయం కోసం అడవుల్లోకి వెళ్లి నక్సలైట్ ఉద్యమంలో చేరాను. కానీ అసలైన మార్పు తుపాకీతో కాదు, విద్య, అనుభూతి, సాధికారతతో సాధ్యమవుతుందని తెలుసుకున్నాను" అని తెలిపారు. తాను జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత తిరిగి విద్యను ప్రారంభించి, ఎం.ఏ., ఎల్.ఎల్.బి., ఎల్.ఎల్.ఎం, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు చెప్పారు. "అడవుల నుంచి ప్రజాస్వామ్య సభల వరకు నా ప్రయాణం




సాక్ష్యం. ప్రజల కోసం ప్రజాస్వామ్యంలోనే నిజమైన విప్లవం ఉంటుంది" అన్నారు.

తెలంగాణలో మహిళల సాధికారతపై ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను మంత్రి సీతక్క వివరించారు. "ఇందిరా మహిళా శక్తి పాలసీ ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దుతున్నాం. మహిళలు క్యాంటీన్లు నడుపుతున్నారు, సోలార్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు, ఆర్టీసీకి బస్సులు అద్దెకు ఇస్తున్నారు, పెట్రోల్ బంకులు నడుపుతున్నారు. ఆర్టీసి బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణికులు ఇప్పుడు ఆర్టీసి అద్దె బస్సులకు యాజమానులుగా ఎదిగారు" అని ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలు సాధించిన విజయాలను గ్లోబల్ వేదికపై ఆవిష్కరించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళల భాగస్వామ్యం 40 శాతం కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అది 20 శాతం లోపే ఉందని తెలిపారు. స్థూల జాతి ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం పెంచేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే సంకల్పంతో మా ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతి సంవత్సరం కనీసం రూ.25 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు మహిళా సంఘాలకు అందిస్తున్నాం," అని సీతక్క తెలిపారు. 'వడ్డీ లేని రుణాలు' పథకం కింద ఏటా రూ. వేయి కోట్ల కు పైగా మహిళా సంఘాలకు వడ్డీలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. 63 లక్షల మంది మహిళల సంఘటిత శక్తిగా "ఇందిరా మహిళా శక్తి" పనిచేస్తోందని, ప్రతి ఆడబిడ్డ ఆర్థికంగా స్వావలంబిగా మారడం తమ లక్ష్యమని చెప్పారు.

మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి మాట్లాడుతూ, "ఆరోగ్యలక్ష్మి, బాలమృతం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లక్షలాది తల్లులు, పిల్లలకు పోషకాహారం అందిస్తున్నాం. అడవుల్లోని దూరప్రాంత గ్రామాల్లో కూడా డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు చేస్తున్నాం," అని వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజనుల హక్కులను కాపాడడమే తెలంగాణ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని సీతక్క పేర్కొన్నారు. సవాళ్లను అధిగమిస్తూ ములుగు అడవుల్లో కంటేయినర్లలో పాఠశాలు, వైద్య కేంద్రాలను నిర్వహిస్తున్న విషయాన్ని ప్రపంచ దేశాల ముందు ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల సాధికారత లక్ష్యంగా మారిందని ఆమె పేర్కొన్నారు. "ఆఫ్రికాలో కోడింగ్ నేర్చుకుంటున్న అమ్మాయి, లాటిన్ అమెరికాలో వ్యాపారం ప్రారంభించిన తల్లి, భారతదేశంలోని గిరిజన స్త్రీ... మన అందరికి ఒకే గమ్యం. మహిళ అభివృద్ధి చెందితే, సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది. మహిళల సాధికారతే దేశ సాధికారత" అని ఆమె హితవు పలికారు. "నా ప్రయాణం అడవుల నుండి గ్లోబల్ వేదికల వరకూ సాగింది. సాధికారత ఎవరో ఇస్తే కాదు. మనమే సాధించేది, పంచేది. ప్రపంచానికి మహిళల శక్తి చూపించాల్సిన సమయం వచ్చింది" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. మంత్రి సీతక్క ప్రసంగం సదస్సులో పాల్గొన్న అనేకమంది మహిళలకు ప్రేరణగా నిలిచింది. ఆమె ప్రసంగం ముగిసిన వెంటనే వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది. చిత్తశుద్ధి, నిబద్ధత, పట్టుదలకి కృషిని జోడిస్తే ఎక్కడో ఆదివాసీ గిరిజన ప్రాంతంలో పుట్టిన సీతక్కలాంటి సాధారణ మహిళలు కూడా ప్రపంచ వేదికలపై తమ ముద్ర వేయగలరని చెప్పడానికి ఆమె విజయగాథ ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో పెరూ దేశపు మొట్టమొదటి మహిళ ప్రధాని బెట్రిజ్ మెరినో, వివిధ దేశాలకు చెందిన మహిళా ఎంపీలు, మహిళా ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. ఆయా దేశాల్లో నెలకొన్న పరిస్థితులు, మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాధించాల్సిన లక్ష్యాలపై తమ అనుభవాలను వివరించారు.

# ట్రంప్‌కు ట్రిపుల్ షాక్

## ట్రంప్‌ను ఓడించిన ముగ్గురు భారతీయ ముస్లింలు

### న్యూయార్క్‌లో ఓడించిన జోహ్రాన్ మమ్దానీ
### వర్జీనియాలో ఓడించిన హైదరాబాద్ మలక్ పేట ముద్దుబిడ్డ గజాలా హష్మీ





**మహా:** అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయ్యాక భారతీయుల్ని లక్ష్యంగా చేసుకుని చెలరేగిపోతున్న డొనాల్డ్ ట్రంప్ కు ఒకేరోజు ట్రిపుల్ షాక్ తగిలింది. రిపబ్లికన్ల ఆధిపత్యానికి గండికొడుతూ బుధవారం మూడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భారతీయ మూలాలున్న ముస్లింలు ట్రంప్ కు షాకిచ్చారు. అమెరికాలోని న్యూయార్క్ సిటీ, సిన్సినాటీ, వర్జీనియాలో జరిగిన ఎన్నికల్లో ముగ్గురు భారతీయ సంతతికి చెందిన ముస్లిం అభ్యర్థులు ఘన విజయాలు నమోదు చేసుకున్నారు. వీరిని ఓడించేందుకు ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగినా ఫలితం దక్కలేదు. ఇందులో న్యూయార్క్ సిటీ నుంచి జోహ్రాన్ మమ్దానీ, సిన్సినాటి నుంచి ఆఫ్తాబ్ పురేవాల్, వర్జీనియానుంచి గజాలా ఫిర్దౌస్ హష్మీ విజయాలు సాధించారు. పార్టీ అభ్యర్థులుగా రిపబ్లికన్లు బరిలో నిలిచారు. మూడుచోట్లా పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో ట్రంప్ విఫలమయ్యారు.

### న్యూయార్క్ మేయర్ గా జోహ్రాన్ మమ్దానీ

న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో గెలిచిన జోహ్రాన్ మమ్దానీ, భారతీయఅమెరికన్ తల్లి మీరా నాయర్‌కు జన్మించగా, హష్మీ భారతదేశంలో జన్మించారు. పురేవాల్ ఒహియోలో పంజాబీ తండ్రి, టిబెటన్ శరణార్థి తల్లికి జన్మించారు. అలాగే మమ్దానీ తల్లి మీరా నాయర్ ప్రముఖ భారతీయ దర్శకురాలు. అతని తండ్రికి కూడా గుజరాత్‌తో పూర్వీకుల సంబంధాలు ఉన్నాయి. జోహ్రాన్ తండ్రి మహమూద్ మమ్దానీ కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆంత్రోపాలజీ ప్రొఫెసర్. న్యూయార్క్‌లో ట్రంప్ మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోకు మద్దతిచ్చారు. మమ్దానీ గెలిస్తే సమాఖ్య నిధులను నిలిపివేస్తామని బెదిరించారు. అయినా ఆయనకే జనం ఓటేశారు. వర్జీనియాలో హష్మీ లెఫ్టినెంట్ గవర్నర్ గా ఎన్నికయ్యారు. సిన్సినాటీలో మేయర్ గా పురేవాల్ రిపబ్లికన్ అభ్యర్థిని ఓడించారు.

### అమెరికాలో హైదరాబాదీ గజాలా హష్మీ

వర్జీనియా స్టేట్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హష్మీ విజయం సాదించారు. ట్రంప్‌కు విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన గజాలా.. వర్జీనియాకు తొలి మహిళా లెఫ్టినెంట్ గవర్నర్‌గా రికార్డు సృష్టించారు. రిచ్‌మండ్ స్టేట్ సెనెటర్‌గా ఉన్న గజాలా హష్మీ.. రిచ్‌మండ్ వర్సిటీలో ప్రొఫెసర్‌గా చేశారు. 1964లో హైదరాబాద్‌లోని మలక్‌పేటలో జన్మించిన గజాలా.. ఆమెకు 4 ఏళ్ల ప్రాయంలోనే ఆమె కుటుంబం అమెరికాకు వెళ్లింది.

## ఎవరీ జోహ్రాన్ మమ్దానీ..?

**అమెరికాలోని అతిపెద్ద నగరమైన న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో 33 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించారు. తద్వారా అమెరికా ఆర్థిక రాజధానికి మేయర్ కాబోతున్న తొలి ముస్లింగా, తొలి భారత సంతతి వ్యక్తిగా, తొలి ఆఫ్రికాలో జన్మించిన వ్యక్తిగా జోహ్రాన్ చరిత్ర సృష్టించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ఆండ్రూ క్యువోమోపై ఆయన భారీ తేడాతో విజయం సాధించారు. జనవరి 1న న్యూయార్క్ మేయర్ గా డెమోక్రాటిక్ పార్టీకి చెందిన జోహ్రాన్ మమ్దానీ ప్రమాణ స్వీకారం చేస్తారు. గత వందేళ్లలో న్యూయార్క్ మేయర్ పదవికి ఎన్నికైన పిన్న వయస్కుడు జోహ్రాన్ కావడం విశేషం. రచయిత , దర్శకురాలు మీరా నాయర్, విద్యావేత్త మహమూద్ మమ్దానీ దంపతులకు జోహ్రాన్ 1991లో జన్మించారు. ఆఫ్రికా దేశమైన ఉంగాడా రాజధాని కంపాలాలో జన్మించిన జోహ్రాన్.. తర్వాత కొంత కాలం దక్షిణాఫ్రికాలో పెరిగారు. జోహ్రాన్‌కు ఏడేళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన కుటుంబం అమెరికాలో స్థిరపడింది. దీంతో అప్పటి నుంచి ఆయన క్వీన్స్‌లోనే పెరిగారు. "నేను క్వీన్స్‌లో పెరిగాను, నేనెప్పుడూ క్వీన్స్‌కు చెందినవాడిని" అంటూ ట్రంప్ విమర్శలకు జోహ్రాన్ గట్టిగా బదులిచ్చారు. న్యూయార్క్ నగరంలో పెరుగుతున్న ఖర్చులు, ఆర్థిక అసమానతలను తగ్గించడానికి కృషి చేస్తానని ఎన్నికల ప్రచారంలో జోహ్రాన్ హామీ ఇచ్చారు. సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సబ్ వే ఛార్జీలపై నియంత్రణతోపాటు రవాణా సదుపాయాల విస్తరణకు వేగంగా చర్యలు తీసుకోవడం లాంటివి ఆయన ప్రచారంలో కీలక హామీలు. అద్దెలను తగ్గించడం, ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థను ఏర్పాటు చేయడం, ఆహార ధరలను తగ్గించడానికి నగర కార్పొరేషన్ ఆధ్వరంలో నడిపే కిరాణా షాపులను ప్రారంభించడం, ధనవంతులపై పన్నులు పెంచడం లాంటివి ఆయన ప్రణాళికలో భాగంగా ఉన్నాయి.**



# పొట్టు మినపప్పు తింటే పుట్టెడు లాభాలు

పొట్టు మినపప్పు, అనగా గింజ తొక్కు తొలగించకుండా ఉంచిన మినపప్పు. పొట్టు మినపప్పులో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పొట్టు మినపప్పులో ఉండే బివిటమిన్లు , ఇతర ఖనిజాలు మెదడు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండటం వలన పొట్టు మినపప్పు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

మినపప్పు అంటేనే పోషకాల గని. వీటిలో ప్రొటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, పాస్పరస్, కాల్షియంతోపాటు ఎన్నో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. మినపప్పులో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీనిని ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణక్రియను మెరుగు పరచుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పప్పు కేవలం వంటకాల రుచిని పెంచడం మాత్రమే కాదు.. దీనిని తీసుకోవడం వల్ల బోలెడు హెల్త్ బెనిఫిట్స్ పొందవచ్చు. అందుకే ఈ పప్పును పోషకాల గని అని అంటారు.

డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న వారు.. మినప పప్పుతో చేసిన వంటకాలు ప్రతీ రోజు డైట్‌లో చేర్చుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందంటున్నారు. పొట్టు మినపప్పుతో మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని చెబుతున్నారు. పొట్టు తీయని మినప పప్పును తీసుకుంటే మరింత ఎక్కువ ప్రయోజనకరం. ఈ పప్పులో పుష్కలంగా ఉండే ఫైబర్, ప్రొటీన్లతో పాటు ఇతర పోషకాలు రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్లో ఉంచడానికి చాలా బాగా సహాయపడతాయంటున్నారు.

మినప పప్పులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను తగ్గించడానికి ఇది చాలా బాగా సహాయపడుతుందని చెబుతున్నారు. ఈ పప్పు.. కిడ్నీల సంరక్షణకు మరింత మంచిది. మినప పప్పులో సమృద్ధిగా ఉండే కాల్షియం, పాస్పరస్ ఎముకల ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయి. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మరింత మంచిది. మినప పప్పు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుంది.ఈ పప్పులోని పోషకాలు సన్ టాన్స్, మొటిమలు, ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పని చేస్తాయి. ఈ పప్పుతో జుట్టు సంరక్షణకు మేలు జరుగుతుంది.

పొట్టు మినపప్పు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే పప్పులలో ఒకటి. ఇది పోషక పదార్థాల్లో సమృద్ధిగా ఉండి ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. పొట్టు మినపప్పులో ఉండే పోషకాలు శరీర కండరాల అభివృద్ధి కోసం అత్యవసరమైన ప్రోటీన్లు సమృద్ధిగా ఉన్నాయి. జీర్ణశక్తి కోసం దీనిలో ఉన్న ఆహార ఫైబర్ ఉపయోగపడుతుంది.

పొట్టు మినపప్పులో ఫైబర్ అధికంగా ఉండడం వలన జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేస్తుంది. పేగుల్లో వ్యర్థాలను సులభంగా బయటకు పంపే విధంగా ఇది సహాయపడుతుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీనిలో ఉండే క్యాల్షియం, మెగ్నీషియం, ఎముకల ఆరోగ్యానికి పెంపొందిస్తాయి. B విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఐరన్ అధికంగా ఉండటం వలన రక్తహీనత సమస్యతో బాధపడే వారికి ఇది మంచిదిగా పనిచేస్తుంది. గర్భిణీ స్త్రీలు కూడా దీనిని తీసుకోవడం వల్ల ఉపయోగాలు పొందవచ్చు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# అశ్రునయనాల మధ్య గడ్డం అఖిల్ రెడ్డి సంతాప సభ

**ప్రజా సేవాభవన్ లో ఘన నివాళ్లు .. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, బంధుమిత్రులు, సన్నిహితులు.. అఖిల్ తో తమకున్న అనుబంధాన్ని పంచుకొని సంతాపం**









**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి సంతాప సభ బుధవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్ లో అశ్రునయనాల మధ్య జరిగింది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,బంధుమిత్రులు, సన్నిహితులు అఖిల్ రెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళ్లు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేసారు.ముందుగా అఖిల్ తండ్రి గడ్డం రమేష్ రెడ్డి , సోదరి మౌనా శ్రీనివాస రెడ్డి బావ కంది శ్రీనివాస రెడ్డి, మేనమామ దేరా కృష్ణా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గత నెల 26న ఆదివారం ఉదయం గుండె పోటుతో అకాలమరణం చెందిన గడ్డం అఖిల్ రెడ్డి తో తమ కున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ బరువెక్కిన హృదయాలతో మాటలు పంచుకుంటూ సంతాపం తెలిపారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని , వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్ధిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ , కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్,ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి , బోథ్ ఆత్మ కమిటి చైర్మన్ గొర్ల రాజుయాదవ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు మునిగెల విఠల్,వామన్ వాంఖడే,మాజీ జడ్పీటీసీ కొండ గంగాధర్, రాందాస్ నాక్లే , బేల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ , కాంగ్రెస్ నాయకులు గుడిపల్లి నగేష్, సుజాత్ అలీ, దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్,భోజారెడ్డి, మునిగెల నర్సింగ్ ,మంచికట్ల ఆశమ్మ, దేశెట్టి ప్రభావతి,శ్రీలేఖ,అన్నపూర్ణ, తుమ్మల వెంకటరెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ కాంతుల్లో మైసిగండి ఆలయం

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ అమ్మవారి దేవాలయం దేదీప్యమైన వెలుగులతో శోభను సంతరించుకుంది. ఆలయమంతా విద్యుత్ కాంతులు విరజిల్లుతున్నాయి. ఆలయం పరిసర ప్రాంతాలు రంగురంగులదీపాలతోచూపరులనుకనువిందు చేస్తున్నాయి. ఆలయ ముఖద్వారాన్ని సుందరంగా అలంకరించారు. ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. రాత్రుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద వేసిన తూకానికి పైకం..!

**స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

- పట్నంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- రైతులను సతాయిస్తే ఊరుకోం బ్లాక్ లిస్టులో పెట్టాల్సిందే..?



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని, ఇబ్రహీంపట్నం, మంచాలలో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగా రెడ్డి ప్రారంభించారు. అనంతమైన మాట్లాడుతూ... రైతులు కష్టపడి పండించిన పంటను, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలను అందించి కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్నికి తేమశాతం ఎంత ఉందని ఇక్కడే నిర్ధారించి తూకం వేయాలని అన్నారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత తరుగు తీస్తామంటే ఒప్పుకునేది లేదని, ఏదైనా కొనుగోలు కేంద్రాల వద్ద నిర్ణయించిన తూకానికి తగిన ధర చెల్లించాలని, అలాకాకుండా రైతులకు అన్యాయం చేస్తూ వారి ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని రైతులను సతాయిస్తే, మిల్లర్ యాజమాన్యాల పేర్లను, బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులకు హెచ్చరించారు. రైతుల కష్టాన్ని దోచుకోవాలని చూస్తే సహించేది లేదని, గతంలో జరిగిన ఒక తప్పకాలు తమ దృష్టికి వచ్చాయని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని కొనుగోలు కేంద్రాలలో, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను, రైతులకు అందించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు రాజశేఖర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసి శేఖర్ గౌడ్ మామ, భూపతిగల్ల మహిపాల్, ఏఎంసి చైర్మన్ కర్ణాకర్, డైరెక్టర్లు డి రాజు, శ్రీశైలం, మండల వ్యవసాయ అధికారిని విద్యాధరి, ఐకెపి సెంటర్ నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నీటిలో నిలబడి నిరసన

**ఆమనగల్లు, మహా :** తలకొండపల్లి నుంచి మిడ్జిల్ ప్రధాన రహదారిపై చంద్రధన గ్రామ శివారులో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు బుధవారం బ్రిడ్జిపై నిలిచిన నీటిలో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డును డబల్ రోడ్డుగా నిర్మాణం చేపట్టినా 50 ఏళ్ల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి నిర్మాణం చేపట్టక పోవడంతో నల్లచెరువు నిండి రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తయన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మిషన్ భగీరథ కార్మికుల రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం మిషన్ భగీరథ కార్మిక యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో, షాబాద్ బిపిటి వద్ద విధులు బహిష్కరించి, కార్మికులకు రావాల్సిన రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ మాట్లాడుతూ... మిషన్ భగీరథ కార్మికులకు ఎన్సిసి యాజమాన్యం రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కార్మికులు 2018 నుంచి విధులు నిర్వహిస్తున్నారని అప్పటినుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా వేతనాలు పెంచలేదని, కార్మికులకు ఈఎస్ఐ,పిఎఫ్ ఎంత కట్ అవుతుందో తెలియని అయోమయంలో ఉన్నారని, వారాంతపు సెలవులు అమలు చేయడం లేదని మండిపడ్డారు. కార్మికులతో 12 గంటలు పని చేయించుకుంటూ వారి శ్రమను దోచుకుంటున్నారని తెలిపారు. మిషన్ భగీరథ డిఈ, ఏఈ ఉన్నతాధికారులు, కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వేధిస్తున్న ఎన్సిసి యాజమాన్యంపై, వెంటనే చర్యలు తీసుకొని మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇప్పించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విధులు బహిష్కరించి నిరవధికంగా ఆందోళనలు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ ప్రవీణ్ కుమార్, మిషన్ భగీరథ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

**ఆరుట్ల గ్రామంలో బుగ్గ జాతర ఘనంగా ప్రారంభం**

- పున్నమి నుంచి అమావాస్య వరకు కొనసాగనున్న జాతర
- రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేస్తున్న భక్తులు
- ఆలయానికి విచ్చేసే భక్తులకు ప్రత్యేక బస్సులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలోని, ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి ఆలయంలో కొలువుదీరిన అతి పురాతనమైన రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం చేసి కార్తిక దీపం వెలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం నలుమూలల నుంచి జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. భక్తులకు తగు వసతులను కల్పిస్తూ, అధికారులు ఎప్పటికప్పుడు ఈ యొక్క జాతరను పర్యవేక్షించాలని తెలిపారు. గత సంవత్సరం చెప్పిన విధంగా ఆలయ వచ్చే రోడ్లను వేయించడం జరిగిందని, ఆలయానికి మరమ్మతులు చేయించి భక్తులకు కావలసిన సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి కావలసిన నిధులను కేటాయించడం జరుగుతుందని అన్నారు.

**ప్రఖ్యాతిగాంచిన ఆలయం...**

మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి యొక్క ఆలయం రాష్ట్రంలోనే ఎంతో ప్రఖ్యాతిగాంచింది. బుగ్గ జాతర కార్తిక పున్నమి బుధవారం నుంచి ప్రారంభం అయింది. కార్తీక మాసంలో ఇక్కడ స్నానమాచరిస్తే ఎంతో పుణ్యంగా భక్తులు భావిస్తారు. ఇక్కడికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఇప్పటికే గుడి దగ్గర, వచ్చే మార్గంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**ఆలయానికి చేరుకోవడానికి బస్సు రూట్...**

ఇబ్రహీంపట్నంలోని ఆరుట్ల గ్రామంలో అతి పురాతనమైన ప్రఖ్యాతగాంచిన శ్రీశ్రీశ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు, కోటి నుండి 277, 277D బస్సులు కలవు, అలాగే జూబ్లీహిల్స్ బస్టాండ్, సికింద్రాబాద్ నుంచి వచ్చే భక్తులకు 279 ఇబ్రహీంపట్నం వరకు చేరుకుని, అక్కడి నుండి ఆరుట్ల బుగ్గ జాతర స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ రాజప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, ప్రేమాకర్ రెడ్డి, ముత్యాల రాజశేఖర్ రావు, భూపతిగల మహిపాల్, వెదిరె హనుమంత్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, సికిందర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు, పలు శాఖల అధికారులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



## వరద నీటితో వాహనాల రాకపోకలకు అంతరాయం

**రాజేంద్రనగర్, మహా :** గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు పెద్ద గోల్కొండ అండర్పాస్ వద్ద వరద నీరు చేరడంతో ట్రాఫిక్ ఏసీపి నాగభూషణం, సీఐ ప్రమోద్ కుమార్ తో కలిసి బుధవారం అండర్పాస్ ను పరిశీలించారు. వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల ముఖ్య గమనిక శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సంఘీగూడచెరువు నిండి అలుగు పరుతుండంతో దగ్గర్లో ఉన్న ఓ ఆర్ ఆర్ అండర్ పాస్ లో వరద నీరు చేరి అండర్ పాస్ నిండిపోయింది. దింతో ఓ ఆర్ ఆర్ రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డుల మీద వరద నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. చుట్టుపక్కల గ్రామాల వాహనదారులు ప్రత్యామ్నాయ రహదారిని ఎంచుకొని మీ మీ గమ్యస్థానాలకు వెళ్లగలరు. పెద్ద గోల్కొండ టోల్ దిగి పీ1 రోడ్డు వెళ్లే వాహనదారులు అటు నుంచి వెళ్లకుండా తొండుపల్లి ఎగ్జిట్ దగ్గర దిగి ఎన్ హెచ్ 44 వైపు వెళ్ళగలరు. చుట్టుపక్కల గ్రామా ల వాహనదారులు పెద్ద గోల్కొండ గ్రామము నుండి వెళ్లాలని ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్ తెలిపారు.

## గూడెం గుట్టలో కార్తీక పౌర్ణమి జాతర



**జన్నారం మహా :** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా భక్తులు పోటెత్తారు.ఉదయం మూడు గంటల నుండి పూజలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులు పవిత్ర గోదావరి లో స్నానమాచరించి గూడెం సత్యదేవుని ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. సత్యనారాయణ స్వామి నోములు నోచుకుని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసము సందర్భంగా సత్యదేవుని దర్శనం ఎంతో పుణ్య ఫలముగా భావిస్తామని భక్తులు అన్నారు. కార్తీక మాసం లో సత్యదేవుని నోములు నోచుకోవడం ఆనవాయితీగా వస్తుందని ,ప్రతీ సంవత్సరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తామని అన్నారు, జాతరకు వచ్చే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. మంచిర్యాల డిసిపి భాస్కర్ ఆదేశాల మేరకు ఏసీపి ప్రకాష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 200 మంది సిబ్బంది తో బందోబస్తు నిర్వహిస్తున్నారు,

## తలమడుగు మండలంలో కార్తీక సందడి



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో పాటు అతి పురాతనమైన ఝరి, నందిగామ, దేవాపూర్, బరంపూర్ గ్రామాలలో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఉదయం నుంచి భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.. ఆయా ఆలయాలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువ జామున కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. కార్తీక దీపాల వెలుతురుతో ఆలయ ప్రాంగణాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.

## కార్మికులను విధుల నుండి తొలగించేందుకు కుట్ర

**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియాలో కార్మికులను విధుల నుండి తొలగించేందుకు గుర్తింపు సంఘం ఎన్నికలలో గెలిచిన సంఘాలు కుట్ర చేస్తున్నాయని సిఐటియు మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకట్ స్వామి, ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్లు ఆరోపించారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిలో సిఐటియు ద్వారా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ యాజమాన్యంతోసింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో గెలిచిన సంఘాలు పాలసీ విధానమైన ఒప్పందాలను చర్చించడానికి సంస్థ చైర్మెన్ తో గత మార్చి నెలలో స్ట్రక్చర్ సమావేశంలో నిర్వహించారని వారన్నారు. ఆ సమావేశంలో కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించడానికి యాజమాన్యం సంవత్సరానికి ఒక కార్మికుడు 150 రోజులు విధులు నిర్వహించాలని నిబంధన తీసుకువస్తే దానికి గుర్తింపు సంఘం ఏఐటియుసి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియుసి లు ఆరోజు స్పందించకపోవడంతో నేడు యాజమాన్యం ఈ సర్కులర్ ను తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్కులర్లో 150 మస్టర్లే కాకుండా, 190 మస్టర్లు చేయకపోయినా చార్జీషిట్ ఇచ్చే విధంగా యాజమాన్యం రూపొందించిందని ఆరోపించారు. ఈ విధానాన్ని సింగరేణి కంపెనీ వెనకకు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేస్తుందని స్పష్టం చేశారు. ఇటీవల పత్రికల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామంటూ చెప్పి కార్మికుల నుండి వస్తున్న వ్యతిరేకతను గమనించి ఇప్పుడు వ్యతిరేకించడం వారి ద్వంద్వ విధానానికి నిదర్శనమని, దీనిని కార్మిక వర్గం గ్రహించాలని పేర్కొన్నారు. ఒక నెలలో 16/20 మస్టర్లు లేకుండా కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెబుతున్న అధికారులు అన్ని నెలలు సక్రమంగా చేసిన ఒక నెల విధులు సరిగ్గా నిర్వహించకపోయిన వారికి కౌన్సిలింగ్ రావడం వలన ఆయా కార్మికులు మనోవేదనకు గురవుతారని వారు వెల్లడించారు. ఈ విషయంపై సింగరేణి యాజమాన్యం పునరాలోచించాలన్నారు. ముఖ్యంగా గెలిచిన సంఘం నాయకులు జనరల్ షిఫ్ట్ లలో ఉంటూ గనులలోకి దిగకుండా ఉండటాన్ని సింగరేణి విజిలెన్స్ అధికారులకు ఎందుకు గమనించడం లేదని వారు ప్రశ్నించారు.



## కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు

**ఆమనగల్లు, మహా:** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని అమనగల్లు పట్టణ కేంద్రంలోని పురాతన శివాలయం, మార్కండేయ, హనుమాన్ దేవాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజామున నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ పరిసర ప్రాంతాల్లో దీపారాధన చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున నుంచే ఆలయానికి భక్తులు రావడంతో సందడి నెలకొంది.ఆలయలను నిర్వాహకులు బంతిపూలతో అందంగా ముస్తాబు చేశారు. ప్రతి ఇళ్ళు దీపాలతో అలకరించారు

# సదర్ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**యాదవ సంఘం నాయకులు**



**యాదగిరిగుట్ట, మహా:** శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈనెల 8వ తారీకు శనివారం రోజున సాయంత్రం 6గం. భువనగిరి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న సదర్ సమ్మేళన కార్యక్రమానికి జిల్లా నుంచి యాదవ సంఘం నాయకులు యాదవ యువత, యాదవ కుల బంధువులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు పుట్టా వీరేశం యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం యాదగిరిగుట్టలో యాదవ సంఘం ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖ్యర్ల సతీష్ యాదవ్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోనే గణంగా రెండోసారి నిర్వహించే సదరు సమ్మేళన కార్యక్రమానికి యాదవ కుల బంధువులు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీక్రిష్ణ యాదవ సంఘం నాయకులు గుండబోయిన సురేష్ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్,ఆవుశేటి రమేష్ యాదవ్, పర్వతం రంజిత్ యాదవ్, ఆఖిల బారతయాదవ మహాసభ యాదగిరి గుట్ట మండల అధ్యక్షుడు పసుల బాలయ్య యాదవ్, నియోజకవర్గం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సొంత ఇల్లు: మంత్రి శ్రీధర్ బాబు

**సొంత ఇల్లు లేని నిరుపేదలకు**

## డబుల్ బెడ్ రూమ్

- గతంలో నిర్మించిన 2848 ఇండ్లను పేదలకు పంపిణీ
- పేదల పక్షాన మేమున్నాం: మహేశ్వరం ఇంచార్జ్ కేఎల్ఆర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చాలని ఉద్దేశంతో ఇందిరమ్మండ్ల పథకాన్ని చేపట్టి అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు ఈ జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో, రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గంలోని, మంఖాల గ్రామ పరిధిలో ఫేస్ I& IIలో నిర్మించిన 2848 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను, బుధవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి, లబ్ధిదారులకు అలాట్మెంట్ మరియు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో కోర్టు కేసు ఉండటం వలన మంఖాల్I మరియు మంఖాల్II 2BHK ఇండ్ల పంపిణీ కార్యక్రమం ఆగిపోయిందని కోర్టులో కేసు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం చొరవ తీసుకొవడం జరిగిందని, పెండింగ్ లో ఉన్న 2848 మందికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను బుధవారం అందించడం జరిగిందని తెలిపారు. నిజమైన ఇల్లు లేని నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేర్చే ఉద్దేశంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మీకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాయక్, కందుకూరు ఆర్డీవో కే జగదీశ్వర్ రెడ్డి, సంబంధిత అధికారులు, జిల్లా ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# బ్రాస్లెట్ పోగొట్టుకున్న వారు హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించగలరు

**ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్**



**హన్మకొండ మహా;** గత నెల 30వ తేదీన భారీ వర్షాలు కురిసి కురిసి వచ్చిన వరదల్లో అలంకార్ ప్రాంతంలో రవి అనే వ్యక్తికి బంగారు చేతి బ్రాస్లెట్ దొరికింది. నిజాయితీతో అతను స్థానిక హనుమకొండ పోలీస్ స్టేషన్ లో బుధవారం అప్పగించారు. పోగొట్టుకున్న వారు ఎవరైనా తమ బ్రాస్లెట్ కోసం హనుమకొండ పోలీస్ స్టేషన్ కు వచ్చి, సరైన ఆధారాలు చూపించి తీసుకెళ్లగలరని సిఐ మచ్చ శివకుమార్ నేడొక ప్రకటనలో తెలిపారు.



# ఎర్రబోడలో గంజాయి బ్యాచ్ హల్చల్

**మహిళలతో అసభ్య ప్రవర్తన...**

**పార్క్ చేసిన కారు అద్దాలు ధ్వంసం...**

**రాజేంద్రనగర్, మహా;** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబోడలో మత్తులో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. బుధవారం తెల్లవారుజాము వరకు గుడిమెట్ల మీద కూర్చొని కొందరు యువకులు మద్యం సేవించి ఆపై గంజాయి సేవించారు. గంజాయి మత్తులో పార్క్ చేసిన కారు అద్దాలు ధ్వంసం చేశారు. కారు యజమాని ప్రశ్నించడంతో దురుసుగా ప్రవర్తించడంతోపాటు అతనిపై దాడికి ప్రయత్నించారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# శివ నామస్మరణతో మార్మోగిన సంగెం భీమలింగం

**అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసిన ఆలయ కమిటీ.. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు**



**వలిగొండ, మహా:** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఉన్న భీమ లింగేశ్వర దేవస్థానం లో శివయ్యను మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల భక్తులు బుధవారం శివయ్యను దర్శించుకున్నారు మహిళలు పెద్ద ఎత్తున హాజరై మూసీ నది తీరాన స్నానమాచరించి నదిలో కార్తీక దీపాలు వెలిగించారు కార్తీక పౌర్ణమి సందర్భంగా అర్చకులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు భక్తులకుఎలాంటి ఇబ్బందులు జరగకుండా వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో నోముల జంగారెడ్డి బాతరాజు బాల నరసింహ,గ్రామ మాజీ సర్పంచి కీసర్ల రాంరెడ్డి సురకంటి వెంకట్ రెడ్డి మాజీ సర్పంచ్కా సుల కృష్ణ వరికుప్పల మల్లేశం బద్దం రాఘవేందర్ రెడ్డి మంద నరసింహ కందుల తానేష్ సురకంటి మురళీధర్ రెడ్డి ఉండాడి సత్యనారాయణ వాసుదేవారెడ్డి మల్లారెడ్డి శంకర్ యాదవ్ రామ్ చందర్ గిరిధర చారి,శ్రీకాంత్ రామాంజనేయులు నోముల మాధవరెడ్డి వరికుప్పల నరసింహ కరుణ్ రెడ్డి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది



# సంగమేశ్వర దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

**మొయినాబాద్ మహా:** కార్తీక పౌర్ణమి సందర్భంగా మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో గల సంగమేశ్వర దేవాలయంలో బుధవారం మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి. కార్తీక ఉసిరి దీపాలను వెలిగించారు. దేవాలయ ప్రాంగణం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులతో సందడి నెలకొంది. మహిళలు యువతులు,పాల్గొని వివిధ రకాల ప్రతిమలను దీపాలంకరణ చేశారు.అనంతరం మాకు ఈ కార్తీక పౌర్ణమి మహిళలకు పిల్లలకు చాలాసంతోషంగా ఉందని మంచి అనుభూతి కలిగిందని అన్నారు.

# హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

**మొయినాబాద్ కేంద్రంలో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ధర్నా**



**మొయినాబాద్ మహా:** హైదరాబాద్‌బీజాపూర్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని రోడ్లు రహదారుల ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. బుధవారం మొయినాబాద్ మండల, మున్సిపల్ కేంద్రంలోని ఆయా గ్రామాల ప్రజలు, యువకులు కలిసి మొయినాబాద్ మండల కేంద్రంలోని హైదరాబాద్‌బీజాపూర్ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌బీజాపూర్ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ఎంతోమంది పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న గాని నాయకులు ప్రభుత్వాలు పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. అన్ని గ్రామాలలో గుంతలు లేని రోడ్లను నిర్మించాలని అన్ని గ్రామాల లింకు రోడ్లను పూర్తిచేయాలని సూచించారు. తక్షణమే ప్రభుత్వం హైదరాబాద్‌బీజాపూర్ జాతీయ రహదారి పనులు నిర్మించాలని అన్నారు. ఈ ధర్నా ఆరంభం మాత్రమేనని తెలిపారు. హైదరాబాద్‌బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభం కాని పక్షాన ప్రజా ప్రతినిధులపై తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. పనులు ప్రారంభించకుండా ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే అడుగడుగున ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల మున్సిపల్ గ్రామాలకు చెందిన ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సోమేశ్వరాలయంలో కలెక్టర్ హనుమంతరావు పూజలు



**ఆలేరు, మహా:** కార్తీక పౌర్ణమి పురస్కారించుకొని బుధవారం నాడు దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధిగాంచిన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ సోమేశ్వరాలయంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్ రావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు... కలెక్టర్ వెంట ఆలేరు తహశీల్దారు వున్నారు..




# హైదరాబాద్ బీజాపూర్ రహదారిపై మరో ప్రమాదం

**మొయినాబాద్ మహా:** హైదరాబాద్ బీజాపూర్ రహదారిపై మరో ప్రమాదం చోటుచేసుకుంది. మొయినాబాద్ కేంద్రంలోని తాజ్ హోటల్ ముందు చెట్టును ఢీకొట్టిన కారు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి చేవెళ్ల వెళ్తున్న కారు TS11 EH 6699 బెలూనో కారు మొయినాబాద్ లోని హైదరాబాద్ బీజాపూర్ రహదారి పక్కన ఉన్న ఓ చెట్టును కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. నలుగురికి స్వల్ప గాయాలతో భయటపడగా ఒకరికి మాత్రం తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. ప్రయాణికులు హైదరాబాద్ బీజాపూర్ రహదారిపై ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు.

# ప్రతీ నోటా నవీన్ యాదవ్ పేరే నీలం పద్మ వెంకటస్వామి



**జూబ్లీ హిల్స్, మహా:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం బుధవారం గడపగడపకు తిరుగుతూ ప్రచార నిర్వహించారు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎంపీ మల్లు రవితో ,పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి... జూబ్లీహిల్స్ ప్రతీ గడప ప్రతీ నోటా నవీన్ యాదవ్ పేరే వినిపిస్తుందని ములుగు నియోజకవర్గ బోరబండ నియోజకవర్గ కార్యకర్తలతో బోరబండ డివిజన్ లో యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ ప్రచారంలో పాల్గొన్నారు. సందర్భంగా ప్రతి కాలనీలో కలయ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. బి ఆర్ఎస్. బిజెపి నాయకులు సోషల్ మీడియాలో ఎన్ని అసత్య ప్రచారాలు చేసిన జూబ్లీహిల్స్ ప్రజల మధ్య నవీన్ యాదవ్ పుట్టి పెరిగి కష్ట కాలంలో చేసిన సహాయాన్ని గుర్తు చేస్తున్నారని ప్రతి ఒక్కరి నోట నవీన్ యాదవ్ పేరు వినిపిస్తుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుగుణ, డివిజన్ ప్రెసిడెంట్ ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# మణికొండలో హైడ్రా కు మద్దతుగా ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీ స్ & ఆర్‌డబ్ల్యూఎ తరపున ప్లకార్డులతో ర్యాలీ

**గండిపేట, మహా:** మణికొండ మున్సిపాలిటీలో వందల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను హైడ్రా కాపాడినందుకు వారికి మద్దతుగా ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ మరియు ఆర్డబ్ల్యూఎ వారి ఆధ్వర్యంలో బుధవారం మణికొండ మున్సిపాలిటీ లోనీ మర్రిచెట్టు కూడలి వద్ద హైడ్రా కు మద్దతుగా ప్లకార్డులు పట్టుకుని మద్దతుగా ర్యాలీ జరిపారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ మరియు ఆర్డబ్ల్యూఎ ప్రెసిడెంట్ వంశీ మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ లోనీ తిరుమలహిల్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, వెస్ట్రన్ ప్లాజా తదితర కాలనీలలో వందల కోట్లు విలువ చేసే భూములు మరియు పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా హైడ్రా కాపాడటం చాలా అభినందనీయమన్నారు.ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు అని హైడ్రా లో పిర్యాదు చేసిన వెంటనే స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీస్ సభ్యులు,మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ నాలుగవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



**మొయినాబాద్ మహా:** ఈ నెల 10వ తేది సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న సీఐటీయూ నాల్గోవ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల సీఐటీయూ ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల సీఐటీయూ కన్వీనర్ అజీజ్ నగర్ గ్రామానికి చెందిన ప్రవీన్ కుమార్ ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అల్లి దేవేందర్ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 10,11వ తేదిల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ లో జరగబోయే సీఐటీయూ రంగారెడ్డి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ నిత్యం కార్మికుల పోరాటం చేస్తుందని గుర్తుచేశారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా ఎర్రజెండా సీఐటీయూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తనకు మండల కన్వీనర్ గా భాద్యతలు అప్పజెప్పినందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులపక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 450 పేద కుటుంబాలకు అండగా నిలిచిన కార్పొరేటర్

**కమిషనర్ చేతుల మీదుగా నిత్యవసర సరుకుల పంపిణీ**



**వరంగల్ మహా;** ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షం కురిసి వరంగల్ నగరంలో వరద బీభత్సం సృష్టించింది. ఈ నేపథ్యంలో చాలా ఇండ్లలో బియ్యం తడిసి ముద్దయి నిత్యవసర సరుకులు కూడా వరదల్లో కొట్టుకుపోయి అపారమైన ఆస్తి నష్టంతో సర్వం కోల్పోయిన పేద మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 28వ డివిజన్ ప్రజలను స్థానిక కార్పొరేటర్ గందె కల్పన నవీన్ దంపతులు వారికి అండగా నిలుస్తున్నారు. డివిజన్ లోని వరద ముంపు ప్రాంతాలైన సంతోష్ మాత కాలనీ1 సంతోష్ మాత కాలనీ 2 లలో సుమారు 450 కుటుంబాలకు సన్న బియ్యంతో పాటు 15 రకాల నిత్యవసర సరుకులు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు పంపిణీ చేసి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గందే కల్పన నవీన్ కమిషనర్ తో డివిజన్ లోని ప్రధాన సమస్యల గురించి చర్చించగా కమిషనర్ సానుకూలంగా స్పందించి వర్షాలు తగ్గుముఖం పట్టగానే పక్కా ప్రణాళికతో త్వరలోనే ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మార్వాడి సమాజ్ వారు వరదలు వచ్చినప్పుడు కాలనీ వాసులందరికి ఆశ్రమం కల్పించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి రాజేష్, శంకర్ సింగ్, చకిలం సతీష్, బాగల్ కళ్యాణ్, నరసింహారెడ్డి కనకాచారి, బోయిని రవి, పొకల రాము, తదితరులు పాల్గొన్నారు.

# కొంగు బంగారం మైసిగండి



**ఆమనగల్లు, మహా:** భక్తి విశ్వాసాల ముక్తి ప్రధాత... పేదల ఇలవేల్పు... ఆపద మొక్కుల అమ్మ... శక్తి స్వరూపిణిగా వెలుగొందుతున్న కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయం బ్రహ్మోత్సవాలకు ప్రారంభం అయ్యాయి.జాతరకు నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మైసమ్మ దేవత బ్రహ్మోత్సవాలు ప్రతిఏటా కార్తీక పౌర్ణమి కనుల పండువగా వేడుకలు నిర్వహించారు.. బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.మైసిగండి మైసమ్మ దేవత బ్రహ్మోత్సవాలకు మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలో పరిసరాల ప్రజలకు ఆరాధ్యదేవత కల్వకుర్తి,అచ్చంపేట,శ్రీశైలం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఈ ఆలయం ముందునుండి వెళుతూ ఇక్కడ అగుతాయి. భక్తుల పాలిట కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా ఈమెను కొలుస్తారు.కార్తీక మాసం సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం ఉదయాన్నే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు షాద్నగర్ ఏసిపి లక్ష్మి నారాయణ, ఆర్డీవో జనార్దన్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ లక్ష్మీ శిరోలి,కార్యనిర్వాహణాధికారి స్నేహలత, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి,దశరథ్ నాయక్, నాయకులు శ్రీరాములు, అమృనాయక్,పాండు, జవహర్, లింగప్ప, వెంకటేష్,భాస్కర్, జ్యోతి,అరుణ్,పూజారులు యాదగిరి, అమూల్యపాటి,సంతోష్ శర్మ,భాను ప్రకాష్, వెంకటరమణ,బిచ్య నాయక్, శ్రీరాములు, ఆలయ సిబ్బంది కృష్ణ,చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రావణ్, మహేష్,వెంకటేష్,రవి,చారి,శ్రీను, కృష్ణ,ఆలయ దాతలు భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

# జల్లెల్ల పెంటయ్య పార్టీ సభ్యత్వం రద్దు




**ఆమనగల్లు, మహా:** సిఐటియు ప్రజా సంఘానికి పని చేస్తున్న జల్లెల్ల పెంటయ్య ను భారత కమ్యూనిస్టు పార్టీ నుండి సభ్యత్వం రద్దు చేస్తూ పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పిప్పల శివశంకర్ తెలిపారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివశంకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక పద్ధతులకు,నియమ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తు పార్టీకి నష్టం చేస్తున్నారని కావున ఆమనగల్లు ఏరియా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నామన్నారు. పట్నం నరసింహ,శివగల్ల రమేష్, మీసాల హంసమ్మ, తోగరి పోచయ్య, గుమ్మడి కురువయ్య పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి ఆలయంలో కార్తీక దీపోత్సవం, జ్వాలా తోరణోత్సవం

**ప్రారంభించిన నగర మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ మహా;** కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని హనుమకొండ వరంగల్ జిల్లాల్లోని పంచమహా శైవ క్షేత్రాల్లో పరమశివునికి ప్రత్యేక అభిషేకలతో పాటు పూజలు సాయంత్రం దీపోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరమ పవిత్రమైన తేజోలింగమూర్తి శ్రీ భద్రేశ్వరస్వామి వారి సన్నిధిలో (వరంగల్ భద్రకాళీ దేవస్థానంలోని శివాలయంలో) శైవాగమ ప్రవర్తకులు శివశ్రీ ముదిగొండ ధీరజారాధ్యుల వారి నేతృత్వంలో బుధవారం సాయంకాలం 7.00 గంటలకు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి హోమం నిర్వహించారు. అనంతరం జ్వాలా తోరణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ జ్వాలాతోరణ దర్శనం వల్ల మనుష్యుడు సకల పాపముల నుండి విముక్తుడై సకలైశ్వర్యములతో వర్ధిల్లుతారని తెలిపారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. దేవాలయాన్ని సందర్శించిన ముత్తైదువులకు మేయర్ గుండు సుధారాణి తో కలిసి ఆలయ ఈ ఓ రామల సునీత వాయినాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు శ్రీ తానుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, అనంతుల శ్రీనివాసరావు, కటకం రాములు, శ్రీ లక్ష్మీ శ్రీనివాస సేవా ట్రస్ట్ అధ్యక్షులు జి కృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రచారంలో జోరు పెంచిన జిల్లా బీజేపీ నేతలు

**పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల**



**వరంగల్ మహా;** హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నికల ప్రచారంలో వరంగల్ జిల్లా బిజెపి నేతలు జోరు పెంచారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ , బిజెపి కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు లతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోనీ హైమావతినగర్, మోతీ నగర్, శాస్త్రి నగర్, ఎర్రగడ్డ బస్తీలలో ఇంటింటికి బొట్టు కార్యక్రమంలో పాల్గొని కేంద్ర బిజెపి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ బీజేపీ అభ్యర్థి లంకెలా దీపక్ రెడ్డి గెలుపు కొరకు పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించి ఈ ఉప ఎన్నికలలో బీజేపీ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీ తో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో మహిళా మోర్చా నాయకురాలు, డివిజన్ నాయకులు, బూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం ఓ గొప్ప ధార్మిక పుణ్యఫలం

**భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**



**ఆమనగల్లు, మహా:** అన్నదానం ఓ గొప్ప ధార్మిక పుణ్యఫలం అని ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని భూమి మీద జీవించే ప్రతి మానవుడు దైవానుగ్రహం కోసం పరితపించాలని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కడ్తాల్ పట్టణ శివాలయ ఆవరణలో అయ్యప్ప మాల ధరించిన స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఆ ఆవరణ అంతా అయ్యప్ప నామస్మరణతో మారు మోగింది.. డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్, కడ్తాల సింగల్ విండో చైర్మన్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిత్య అన్న ప్రసాద కార్యక్రమాన్ని స్వాములతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మానవుడు చెడుకు దూరంగా ఉంటూ.. భక్తి భావం పెంపొందించుకోవాలని సూచించారు. గత 10 సంవత్సరాలుగా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అయ్యప్ప మాలదరణ స్వాములే కాకుండా ఆంజనేయ ఇతర మాల ధరించిన స్వాములకు నిత్య అన్న ప్రసాద కార్యక్రమాన్ని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ శ్రీకారం చుట్టారన్నారు. నవంబర్ 5 నుంచి ప్రారంభమైన నిత్య అన్న ప్రసాద కార్యక్రమం 60 రోజులపాటు దిగ్విజయంగా కొనసాగించేందుకు గంప లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ గుప్తా ముందుకు వచ్చి పది సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రతిరోజు వివిధ మాల ధారణ స్వాముల కోసం బిక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేసి ఆశీర్వదించాలన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్, నవీన్ వారి కుటుంబ సభ్యులు, గురు స్వాములు భీముడు విజయ్, సైదులు, రాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

# జేబుకు తెలియకుండానే కన్నం వేస్తున్నారా?



డబ్బు సంపాదించడం ఒక కళ. ధనవంతులు అయ్యేందుకు చాలా మార్గాలు అనుసరించి లక్ష్యం చేరినా, దాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎంతో కష్టపడి సంపాదించిన ధనం దేనికి ఖర్చు చేస్తున్నారో సరైన అవగాహన లేకుండానే చాలా మంది నష్టపోతున్నారు. ఇది కేవలం తక్కువ ఆదాయం ఉన్నవారికి మాత్రమే కాదు, అపార సంపద ఉన్నవారికి కూడా వర్తిస్తుంది. ఆర్థిక స్వేచ్ఛకు పునాదులు వేసుకోవడానికి బదులు, దారిద్ర్యం వైపు నడిపించే ప్రమాదకరమైన అలవాట్లు, ఆర్థిక నిర్ణయాలు ఏమిటో తెలుసుకోవడం అత్యవసరం.

**అదుపులేని వినియోగం**

'నాకు ఇప్పుడే ఆ వస్తువు అవసరం లేదు, కానీ కొనాలి' అనే భావన పేదరికానికి మొదటి మెట్టు. క్రెడిట్ కార్డులు లేదా వ్యక్తిగత రుణాలపై వస్తువులను కొనుగోలు చేయడం, వాటిపై భారీ వడ్డీ చెల్లించడం వల్ల ఆర్థిక భారం పెరుగుతుంది. తరచుగా కొత్త మోడల్ ఫోన్లు, కార్లు లేదా ఫ్యాషన్ వస్తువుల కోసం అధికంగా ఖర్చు చేయడం వంటి విధానాల ద్వారా డబ్బు కరిగిపోతుంది. కొనుగోలు చేసిన వస్తువుల విలువ కాలక్రమేణా తగ్గిపోతుంది. ఇతరులను అనుకరించడానికి లేదా సమాజంలో గొప్పగా కనిపించడానికి స్థోమతకు మించిన ఖర్చులు చేయకూడదు.

**ఆర్థిక అవగాహన లేకపోవడం**

డబ్బు సంపాదించడం గురించి తెలుసుకోవడమే కాదు, అది ఎలా పనిచేస్తుందో తెలియకపోవడం అతి పెద్ద లోపం. డబ్బును బ్యాంకులో ఉంచడం సురక్షితమని భావించి చాలా మంది దాని విలువ ద్రవ్యోల్బణం కారణంగా క్రమంగా తగ్గిపోతోందని గ్రహించడం లేదు. భవిష్యత్తు కోసం పొదుపు చేయడం ముఖ్యం. కానీ ఆ పొదుపును తెలివిగా పెట్టుబడి పెట్టకపోతే ఆర్థిక లక్ష్యాలు నెరవేరవు. పన్నుల విధానంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల అనవసరంగా ఎక్కువ పన్నులు చెల్లించడం లేదా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు.

**అత్యవసర నిధి..**

ఊహించని సంఘటనలకు (ఉద్యోగం కోల్పోవడం, అనారోగ్యం, ప్రమాదాలు) సిద్ధంగా లేకపోవడం వల్ల పేదరికం అంచుల్లోకి వెళుతారు. అత్యవసర సమయాల్లో డబ్బు లేకపోతే అధిక వడ్డీకి అప్పులు చేయక తప్పదు. ఇది దీర్ఘకాలికంగా ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది. కనీసం ఆరు నెలల జీవన వ్యయాలకు సరిపడా డబ్బును పక్కన పెట్టుకోవాలి. ఏ చిన్న విపత్తు వచ్చినా తీవ్ర సంక్షోభం నుంచి కపాడుకోవడానికి ఇది తోడ్పడుతుంది.

**ఒకే ఆదాయ మార్గంపై ఆధారపడటం**

ఒకే ఉద్యోగం లేదా ఒకే వ్యాపారంపై పూర్తిగా ఆధారపడటం ఆర్థిక ప్రమాదానికి సంకేతం. ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పుడు ఉద్యోగం పోతుందో చెప్పలేం. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు లేకపోతే కుటుంబ పోషణ కష్టమవుతుంది. అదనపు ఆదాయ వనరుల ద్వారా సంపదను వేగంగా పెంచుకునే అవకాశం ఉంది. అన్ని గుడ్లను ఒకే బుట్టలో ఉంచడం మంచిది కాదనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలి.

**దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక..**

రేపటి గురించే కాకుండా 2030 సంవత్సరాల భవిష్యత్తు గురించి ఆలోచించకపోవడం వల్ల కూడా చాలామంది పేదరికంలోకి వెళ్తున్నారు. యువతలో రిటైర్‌మెంట్ గురించి ఆలోచించడం లేదు. దానికోసం పొదుపు/పెట్టుబడి పెట్టడం లేదు. దాంతో వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడేలా చేస్తుంది. ఇల్లు కొనడం, పిల్లల విద్య వంటి స్పష్టమైన ఆర్థిక లక్ష్యాలు లేకుండా ఇష్టానుసారంగా ఖర్చు చేస్తే పరిస్థితులు తారుమారవుతాయి. దీర్ఘకాలిక పెట్టుబడుల ద్వారా లభించే చక్రవడ్డీ శక్తిని గుర్తించాలి.

# భవిష్యత్తు బంగారు లోహం!



ఏడాది కాలంగా బంగారం, వెండి ధరలు అసాధారణ రీతిలో దూసుకుపోతున్నాయి. ధరల ర్యాలీతో సంతోషిస్తున్న పెట్టుబడిదారులు ఇప్పుడు కీలక దశలో ఉన్నట్లు కొందరు నిపుణులు చెబుతున్నారు. రానున్న కాలంలో బంగారం, వెండి పెరుగుదల ఇలాగే కొనసాగుతుందా.. లేదా అనే అనుమానం వ్యక్తం కావడమే ఇందుకు కారణం. ఈ తరుణంలో కామొడిటీ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేవారికి కాపర్(రాగి) ఆకర్షణీయంగా కనిపిస్తున్నట్లు కొందరు భావిస్తున్నారు. పారిశ్రామిక డిమాండ్, సరఫరా కొరత కారణంగా కాపర్ ధరలు సైతం కొంతకాలంగా పెరుగుతున్నాయి. దాంతో కాపర్ 'భవిష్యత్తు బంగారం'(లాభాల పరంగా)గా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాపర్ ధరలు గడచిన ఏడాది కాలంలో దాదాపు 25 శాతం పెరిగాయని కొన్ని రిపోర్టులు చెబుతున్నాయి. ప్రస్తుతం కేజీ కాపర్ ధర సుమారు రూ.750గా ఉంది. ఇది 2026లో రూ.1500రూ.1800 వరకు పెరిగే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు.

**అసలు బంగారం, వెండి ధరలు ఎందుకు పెరిగాయి?**

బంగారం, వెండి ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరగడానికి అనేక అంతర్జాతీయ, దేశీయ అంశాలు దోహదపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు ప్రజలు తమ డబ్బు విలువను కాపాడుకోవడానికి సురక్షితమైన పెట్టుబడి మార్గాల కోసం చూస్తారు. చరిత్రలో బంగారం ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనంగా ఉంది. దీనివల్ల డిమాండ్ పెరిగి ధరలు అధికమయ్యాయి. అనేక దేశాల కేంద్ర బ్యాంకులు భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ఆర్థిక అస్థిరత నేపథ్యంలో తమ నిల్వలను పెంచుకోవడానికి భారీ మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేశాయి. సాధారణంగా యూఎస్ డాలర్ విలువ తగ్గినప్పుడు డాలర్ ఆధారిత బంగారం ఇతర కరెన్సీలు ఉన్న కొనుగోలుదారులకు చౌకగా మారుతుంది. తద్వారా డిమాండ్ పెరుగుతుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మిడిల్ ఈస్ట్ దేశాల్లో సంక్షోభం వంటి సంఘటనలు ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని పెంచాయి. దీనితో పెట్టుబడిదారులు భద్రంగా ఉండే బంగారం వైపు మళ్లారు. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు (EVs) వంటి పరిశ్రమల నుంచి వెండికి పారిశ్రామిక డిమాండ్ పెరుగుతుంది.

**కాపర్ (రాగి) ధరల పెరుగుదలకు కారణాలు..**

ఒకప్పుడు కేవలం పారిశ్రామిక లోహంగా మాత్రమే పరిగణించబడిన కాపర్ ఇప్పుడు ఇన్వెస్ట్‌మెంట్ మెటల్‌గా మారుతుంది. కొన్ని నివేదికల ప్రకారం కాపర్ లోహం గత రెండు దశాబ్దాల్లో దాదాపు 700 శాతం పెరిగింది. ఇది పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గనుల్లో ఉత్పత్తి సమస్యలు, స్థానిక ఆందోళనలు, కొత్త గనుల అభివృద్ధిలో జాప్యం కారణంగా కాపర్ సరఫరా గణనీయంగా తగ్గింది. దీనికి తోడు పెరిగిన డిమాండ్ ధరలను మరింత పెంచింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుండడం, భారీ స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భవన నిర్మాణ రంగం నుంచి కాపర్‌కు డిమాండ్ బలపడుతోంది.

**భవిష్యత్తు అంచనా**

మార్కెట్ నిపుణులు, మైనింగ్ దిగ్గజాలు రాగిని 'తదుపరి బంగారం'గా పేర్కొంటున్నారు. కాపర్ ధరలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**ఎలక్ట్రిక్ వాహనాలు:** ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో రాగి కీలక పాత్ర పోషిస్తుంది. ఒక సంప్రదాయ కారు కంటే ఒక ఎలక్ట్రిక్ కారుకు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ కాపర్ అవసరం అవుతుంది. ఈవీల అమ్మకాలు పెరిగే కొద్దీ కాపర్ డిమాండ్ అపారంగా పెరుగుతుంది.

# బిట్ కాయిన్ దారుణ పతనం.. ఎందుకు?



ప్రముఖ క్రిప్టోకరెన్సీ బిట్ కాయిన్ విలువ దారుణంగా పతనమైంది. గత కొన్ని నెలలుగా దూసుకెళ్లిన ఈ క్రిప్టో ఒక్కసారిగా క్రాష్ అయింది. మంగళవారం (నవంబర్ 4) లక్ష డాలర్ల మార్కు దిగువకు పడిపోయింది. క్రిప్టో మార్కెట్ విస్తృత క్షీణత కారణంగా 7.4 శాతం పడిపోయి ఐదు నెలల కనిష్ట స్థాయి 96,794 (రూ.85.83 లక్షలు) డాలర్ల వద్దకు వచ్చింది. ఇటీవల జోరుమీదున్న బిట్ కాయిన్ సరిగ్గా నెల క్రితం అక్టోబర్ 6న రికార్డు స్థాయిలో 126,000 డాలర్లను తాకింది. అక్కడి నుంచి తాజాగా 20% కంటే పైగా పతనమైంది. గత జూన్ తర్వాత బిట్ కాయిన్ లక్ష డాలర్ల మార్కు దిగువకు పడిపోవడం ఇదే మొదటిసారి.

**క్రిప్టో క్రాష్..**

బ్లూమ్ బెర్గ్ నివేదిక ప్రకారం.. ఈక్విటీలలో బేర్ మార్కెట్ నేపథ్యంలో క్రిప్టో మార్కెట్ కూడా పతనం దిశలో పయనిస్తోంది. బిట్ కాయిన్ మాత్రమే కాకుండా పెద్దగా ట్రేడ్ కాని ఇతర క్రిప్టో కాయిన్‌లు ఇలాంటి క్షీణతలనే నమోదు చేశాయి. 50% పైగా నష్టాలను తెచ్చాయి. ఈథర్ మంగళవారం 15% వరకు పడిపోయింది. కాయిన్ మార్కెట్ క్యాప్ డేటా ప్రకారం.. గత నెలలో ప్రపంచ క్రిప్టో మార్కెట్ మొత్తం మార్కెట్ విలువలో సుమారు 840 బిలియన్ డాలర్లను కోల్పోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన టారిఫ్‌ల యుద్ధం కొత్త మలుపు తీసుకోవడంతో అక్టోబర్‌లో బిట్ కాయిన్ చెత్త పనితీరును నమోదు చేసింది.

**బిట్‌కాయిన్ పతనానికి కారణాలు**

బిట్‌కాయిన్ తాజా పతనానికి అనేక ఆర్థిక, రాజకీయ, మార్కెట్ సంబంధిత అంశాలు కారణమయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడంలో జాగ్రత్తగా వ్యవహరిస్తుండటతో ఇన్వెస్టర్లు క్రిప్టో వంటి రిస్కీ అసెట్‌లపై పెట్టుబడులను తగ్గించి సురక్షిత పెట్టుబడులవైపు మొగ్గు చూపుతున్నారు. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండటం అంటే డాలర్ బలంగా ఉండడం. దాంతో బిట్‌కాయిన్ వంటి ప్రత్యామ్నాయ ఆస్తులకు ఆకర్షణ తగ్గుతుంది. అక్టోబర్ నెలలో క్రిప్టో మార్కెట్‌లో బిలియన్ల డాలర్ల బుల్లిష్ పొజిషన్లు లిక్విడేట్ అయ్యాయి. ఈ ఒత్తిడి అమ్మకాల కారణంగా ధర మరింత వేగంగా పడిపోయింది. బ్లూమ్‌బెర్గ్ ప్రకారం, స్టాక్ మార్కెట్‌లలో బేర్ ట్రెండ్ కొనసాగుతున్న నేపథ్యంలో క్రిప్టో మార్కెట్ కూడా అదే దిశలో కదిలింది. ఇన్వెస్టర్లు "రిస్క్ ఆఫ్" మూడ్‌లో ఉండటంతో బిట్‌కాయిన్ కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధానికి కొత్త మలుపు ఇవ్వడంతో మార్కెట్ అనిశ్చితి పెరిగింది. ట్రేడింగ్ వాల్యూమ్ తగ్గిపోవడం, మదుపరులు వేచి చూడే ధోరణి అవలంబించడం బిట్‌కాయిన్ విలువను దెబ్బతీసింది. ఇటీవల క్రిప్టో ఆధారిత ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్‌ల (ETFs) నుండి నిధులు వెనక్కు మళ్లాయి. భారీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ ఫండ్‌ల ద్వారా క్రిప్టోలోకి పెట్టుబడులు తగ్గించడం, మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరచింది. కొన్ని డిజిటల్ అసెట్ ట్రెజరీ సంస్థలు తమ బిట్‌కాయిన్ నిల్వలను అమ్మే అవకాశం ఉందని ఊహించడంతో మార్కెట్‌లో భయం పెరిగింది. దీని ఫలితంగా ధర మరింత ఒత్తిడికి గురైంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# దొంగలించి ట్రేడ్-ఇన్ ద్వారా కొత్త ఫోన్!

## యూకే మెట్ పోలీస్ పార్లమెంట్‌లో నివేదిక



దొంగిలించబడిన ఐఫోన్ల వ్యాపారాన్ని అరికట్టే ప్రయత్నంలో టెక్ దిగ్గజం యాపిల్ సహకరించడం లేదని యూకే మెట్రోపాలిటన్ పోలీస్ సర్వీస్ (Met Police) తీవ్రంగా ఆరోపించింది. దొంగిలించబడిన ఫోన్లకు క్రెడిట్ పొందేందుకు నేరస్థులు యాపిల్ ట్రేడ్‌ఇన్ (Tradein) ప్రోగ్రామ్‌ను దుర్వినియోగం చేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. యూకే పార్లమెంటు సభ్యులకు (MPs) మెట్ పోలీస్ సమర్పించిన నివేదికలో.. యాపిల్ సంస్థకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ మొబైల్ ప్రాపర్టీ రిజిస్టర్ (NMPR)కు అవకాశం ఉందని తెలిపారు. ట్రేడ్‌ఇన్ పరికరాల నెట్‌వర్క్ స్థితిని తనిఖీ చేయడానికి మాత్రమే యాపిల్ ప్రతిరోజూ దీన్ని ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇందులో ఫోన్ల దొంగతనానికి సంబంధించిన అంశాలను తనిఖీ చేయడం లేదని చెప్పారు. అంటే ఎవరైనా ఐఫోన్లు దొంగతనం చేసి ట్రేడ్‌ఇన్ ప్రోగ్రామ్ ద్వారా క్రెడిట్లు పొంది తిరిగి కొత్త ఫోన్‌ను పొందవచ్చు. లేదా యాపిల్ గిఫ్ట్ కార్డులు పొందవచ్చు. యాపిల్ సరైన తనిఖీలు చేయకుండా దొంగిలించబడిన పరికరాలు మళ్లీ చలామణిలోకి రావడానికి సమర్థవంతంగా అనుమతిస్తుందని పోలీసులు చెబుతున్నారు. నేషనల్ మొబైల్ ప్రాపర్టీ రిజిస్టర్ (NMPR) అనేది దొంగిలించబడిన పరికరాలను గుర్తించడానికి, తిరిగి వాటిని బాధ్యులకు ఇవ్వడానికి చట్ట పరంగా అధికారులు ఉపయోగించే డేటాబేస్. యాపిల్ తన ట్రేడ్‌ఇన్ పథకంలో ఈ రిజిస్టర్‌ను ఉపయోగించడం లేదని పోలీసులు ప్రధానంగా ఆరోపిస్తున్నారు.

**క్రెడిట్ పాయింట్లు**

వినియోగదారులు తమ పాత ఐఫోన్‌ను మార్చుకున్నప్పుడు కొత్త ఐఫోన్ కొనుగోలుకు ట్రేడ్‌ఇన్ ప్రోగ్రామ్‌లో ఉదాహరణకు సుమారు 670 యూరోల వరకు క్రెడిట్ పాయింట్లు ఇస్తారు. సరైన దొంగతనం తనిఖీలు లేకుండా దొంగిలించబడిన ఐఫోన్‌లను ఈ వ్యవస్థలోకి అంగీకరించి తిరిగి విక్రయించడం లేదా పునరుద్ధరిస్తున్నట్లు (Refurbished) పోలీసులు చెబుతున్నారు.

**పెరిగిన దొంగతనాలు**

మెట్ పోలీస్ అందించిన సమాచారం ప్రకారం 2024లోనే లండన్‌లో 80,000 కంటే ఎక్కువ ఫోన్లు దొంగిలించబడ్డాయి. ఇది 2023లో నమోదైన 64,000 దొంగతనాల కంటే పెరిగింది. దొంగిలించబడిన ఈ ఫోన్ల స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేయాలంటే 50 మిలియన్ యూరోలు ఖర్చవుతుందని పోలీసులు అంచనా వేశారు. ఈ ఫోన్లలో 75% పైగా విదేశాలకు తరలివెళ్తున్నాయని, అక్కడ వాటిని విడదీసి విడిభాగాల కోసం ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.

**యాపిల్ ప్రతిస్పందన**

మెట్ పోలీస్ విమర్శలను యాపిల్ ఖండించింది. దొంగిలించబడిన డివైజ్‌ల కోసం కంపెనీ Stolen Device Protection వంటి చర్యలు తీసుకుంటుందని హైలైట్ చేసింది. ఫోన్ యజమాని ధ్రువీకరణ లేకుండా నేరస్థులు డివైజ్‌లోని డేటాను తొలగించడం లేదా తిరిగి విక్రయించకుండా నిరోధించడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుందని స్పష్టం చేసింది.

# నూతన ఎల్‌జీ గజాలా హష్మీ.. మన హైదరాబాదీ!



**న్యూఢిల్లీ:** భారత సంతతికి చెందిన డెమొక్రాట్ గజాలా హష్మీ వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ) రేసులో విజయం సాధించారు. ఆమె రిపబ్లికన్ జాన్ రీడ్‌ను ఓడించారు. హష్మీ.. వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం మహిళ. అలాగే మొదటి దక్షిణాసియా అమెరికన్‌గా గుర్తింపు పొందారు. గజాలా హష్మీ 15వ సెనేటోరియల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె రిపబ్లికన్ ఆధీనంలో ఉన్న రాష్ట్ర సెనేట్ స్థానంపై ఆధిపత్యం సంపాదించి, వర్జీనియా జనరల్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

హష్మీ సొంత వెబ్‌సైట్‌లో.. 'ఇతరుల జీవితాలను మెరుగు పరిచే దిశగా తన ప్రయత్నాలు కొనసాగుతాయని' పేర్కొన్నారు. ఆమె గృహనిర్మాణం, విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ న్యాయం తదితర సమస్యలపై దృష్టి సారించారు. 1964లో హైదరాబాద్‌లో జియా హష్మీ, తన్వీర్ హష్మీ దంపతులకు జన్మించిన గజాలా తన బాల్యాన్ని మలక్‌పేటలోని తన తాత ఇంట్లో గడిపారు. హష్మీ తన నాలుగేళ్ల వయస్సులో తన తల్లి, అన్నయ్యతో కలిసి భారతదేశం నుండి అమెరికాకు వలస వెళ్లారు. అక్కడ వారంతా జార్జియాలో తండ్రితో పాటు ఉన్నారు.

గజాలా తండ్రి ప్రొఫెసర్ జియా హష్మి అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి. అక్కడ అతను ఎంఏ, ఎల్ఎల్‌బీ చేశారు. తరువాత సౌత్ కరోలినా విశ్వవిద్యాలయం నుండి అంతర్జాతీయ సంబంధాలలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం బోధనా వృత్తిని స్వీకరించారు. అతను స్వయంగా స్థాపించిన సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశాడు. హష్మి తల్లి తన్వీర్ హష్మి హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీలో బీఏ, బీఈడీ చేశారు.

హష్మి తన విద్యాభ్యాసం సమయంలో పలు స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లను అందుకున్నారు. జార్జియా సదరన్ విశ్వవిద్యాలయం నుండి బీఏ, అట్లాంటాలోని ఎమోరీ విశ్వవిద్యాలయం నుండి అమెరికన్ సాహిత్యంలో పీహెచ్‌డీ చేశారు. 1991లో హష్మి, ఆమె భర్త అజార్ రఫీక్‌తో పాటు రిచ్‌మండ్ ప్రాంతానికి తరలి వెళ్లారు. ఈ దంపతులకు యాస్మిన్, నూర్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిద్దరూ చెస్టర్‌ఫీల్డ్ వర్జీనియా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులయ్యారు. హష్మీ దాదాపు 30 సంవత్సరాల పాటు ప్రొఫెసర్ గా పనిచేశారు. మొదట రిచ్మండ్ విశ్వవిద్యాలయంలో, తరువాత రేనాల్డ్స్ కమ్యూనిటీ కళాశాలలో పనిచేశారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ వ్యవస్థాపక డైరెక్టర్ గానూ హష్మీ పనిచేశారు.



# రిపబ్లికన్ అభ్యర్థులు ఓటమి.. ట్రంప్ వింత సమాధానం

వాషింగ్టన్: అమెరికా స్థానిక ఎన్నికల్లో ఫలితాలు అమెరికాలోని అధికార రిపబ్లికన్ పార్టీకి ఊహించని షాకిచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓటర్లు ఝలక్ ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన కీలక నేతలను ఓడించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై తాజాగా ట్రంప్ స్పందించారు. అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రుత్ వేదికగా స్పందిస్తూ.. ఎన్నికల బ్యాలెట్ పేపర్‌లో ట్రంప్ ఫొటో లేదు. అమెరికాలో షట్‌డౌన్ ఉంది. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేతలు ఓడిపోవడానికి ఇవే రెండు ముఖ్య కారణాలు అని చెప్పుకొచ్చారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు సెటైరికల్ కామెంట్స్ చేస్తున్నారు. వర్జీనియా ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ఓటమి. వర్జీనియా గవర్నర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బర్గర్. వర్జీనియా తొలి మహిళా గవర్నర్‌గా అబిగైల్ స్పాన్‌బర్గర్ రికార్డు. సిన్సినాటి మేయర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి అఫ్తాబ్ పురేవాల్ గెలుపు. అట్లాంటా మేయర్‌గా డెమోక్రాట్ అభ్యర్థి ఆండ్రీ డికెన్స్ తిరిగి ఎన్నిక. పిట్స్‌బర్గ్ మేయర్ రేసులో డెమోక్రాట్ అభ్యర్థి కోరీ ఓకానర్ విజయం వర్జీనియాలో ట్రంప్ రిపబ్లికన్ పార్టీకి ఇక్కడ ఎదురు దెబ్బ తగిలింది. రిపబ్లికన్ పార్టీ సీయర్స్ ఓటమి పాలవ్వగా.. డెమోక్రాట్ అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బర్గర్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. అబిగైల్ కు 14.80 లక్షల ఓట్లు పోలవ్వగా, సీయర్స్ కు 11.61 లక్షల ఓట్లు వచ్చాయి. అబిగైల్ 3.20 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. వర్జీనియా చరిత్రలో మొదటి మహిళా గవర్నర్ గా అబిగైల్ చరిత్ర సృష్టించారు. మరోవైపు సిన్సినాటి మేయర్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సవతి తమ్ముడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కోరీబౌమన్ కూడా ఓడిపోయారు. ఈయనపై డెమొక్రాట్ అఫ్తాబ్ పురేవాల్ గెలుపొందారు. పురేవాల్ రెండవ సారి మేయర్ గా ఎన్నికయ్యారు. తొలిసారి 2021లో మేయర్‌గా ఎన్నికయ్యారు. మే నెలలో జరిగిన ఆల్ పార్టీ మున్సిపల్ ప్రైమరీలో ఆయన 80% కంటే ఎక్కువ ఓట్లతో గెలిచారు.

# రూ. 7 వేల కోట్ల సినిమా..

## ఓటీటీలో ఉచితంగానే స్ట్రీమింగ్

హాలీవుడ్ సినిమా జురాసిక్ వరల్డ్: రీబర్త్ మరో ఓటీటీలోకి వచ్చేస్తుంది. ఈ ఏడాది జులైలో విడుదలైన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 7500 కోట్ల కలెక్షన్స్ రాబట్టి రికార్డ్ క్రియేట్ చేసింది. 2025లో విడుదలైన హాలీవుడ్ చిత్రాల్లో కలెక్షన్స్ పరంగా నాలుగో స్థానంలో ఉంది. భారత్‌లో కూడా రూ. 100 కోట్లకు పైగానే రాబట్టి సత్తా చాటింది. అయితే, గత చిత్రాల ప్రభావం వల్లే ఈ కలెక్షన్స్ వచ్చాయని, రీబర్త్ పేరుతో వచ్చిన ఈ సీక్వెల్ అంతగా ప్రేక్షకులను మెప్పించలేదని రివ్యూలు వచ్చాయి. ఈ చిత్రంలో స్కార్లెట్ జాన్సన్, జోనాథన్ బెయిలీ, మహర్షలా అలీ కీలక పాత్రల్లో నటించారు. గారెత్ ఎడ్వర్డ్స్ దర్శకత్వం వహించారు. జురాసిక్ వరల్డ్: రీబర్త్ చిత్రం ఇప్పటికే అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే, రెంటల్ విధానంలో అందుబాటులో ఉంది. అమెజాన్‌లో ఈ మూవీ చూడాలంటే అదనంగా రూ. 399 చెల్లించాలని మొదట ప్రకటించారు. కొద్దిరోజుల తర్వాత దానిని రూ. 119కి తగ్గించారు. ఈ క్రమంలోనే తాజాగా జియోహాట్‌స్టార్ (JioHotstar)సంస్థ ఒక కీలక ప్రకటన చేసింది. జురాసిక్ వరల్డ్: రీబర్త్ చిత్రాన్ని ఉచితంగానే చూడొచ్చని తెలిపింది. నవంబర్ 14 నుంచి స్ట్రీమింగ్ అవుతుందని జియోహాట్‌స్టార్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పిల్లలతో పాటు పెద్దలను కూడా 'జురాసిక్ పార్క్' చిత్రాలు ఆకట్టుకున్నాయి. 2022లో వచ్చిన 'జురాసిక్ వరల్డ్: డొమినియన్'కు సీక్వెల్‌గా 'జురాసిక్ వరల్డ్: రీబర్త్' (Jurassic World Rebirth) పేరుతో విడుదల చేశారు. తెలుగులో కూడా అందుబాటులో ఉంది. విజువల్స్‌తో పాటు కొన్ని థ్రిల్లింగ్‌కు గురిచేసే సీన్లు ఉన్నప్పటికీ ప్రేక్షకులను మాత్రం పెద్దగా మెప్పించలేదు. కథ మొత్తం సాగదీతగానే ఉంటుంది.



# టాలీవుడ్‌ను చూసి నేర్చుకోండి

బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సుధీర్ బాబు హీరోగా వస్తోన్న జటాధర మూవీతో తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెడుతోంది. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. సోనాక్షి రోల్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ మూవీ నవంబర్ 7న రిలీజవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్లతో బిజీగా ఉన్న బాలీవుడ్ నటి సౌత్ ఇండస్ట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. తెలుగు పరిశ్రమలో పనిచేసిన తన అనుభవాన్ని పంచుకుంది. దక్షిణాది సినీ ఇండస్ట్రీని చూసి బాలీవుడ్ కొన్ని విషయాలు నేర్చుకోవాలని సోనాక్షి సిన్హా అభిప్రాయం వ్యక్తం చేసింది. దక్షిణాది సినీ పరిశ్రమలో సమయపాలన పాటిస్తారని తెలిపింది. తొమ్మిది గంటలకు షూటింగ్‌కు వస్తే సాయంత్రం ఆరు వరకే ఉంటుందని.. ఈ విషయంలో వారిని అభినందించాల్సిందేనని అన్నారు. వారిని చూసి బాలీవుడ్ మేకర్స్ నేర్చుకోవాలని హితవు పలికింది. బాలీవుడ్‌లో అర్ధరాత్రి వరకు షూటింగ్స్ జరుగుతుంటాయని విమర్శించింది. సౌత్‌లా చేయాలంటే క్రమశిక్షణ అవసరమని సోనాక్షి వెల్లడించింది. తెలుగు చిత్ర పరిశ్రమను చూసైనా బాలీవుడ్ మారాలని సలహా ఇచ్చింది. తన మొదటి తెలుగు ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ..' స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. ప్రాంతీయ భాషల్లో సినిమాలు చేసేందుకు ఉత్సాహంగా ఉన్నా. గతంలో నేను (లింగా) ఒక తమిళ సినిమా చేశా. ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీలో చేశా. ఎల్లప్పుడూ ఇలాంటి చిత్రాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కానీ అంతకు ముందు నా షెడ్యూల్ కుదరక సినిమాలు ఒప్పుకోలేదు' అని చెప్పింది ఆ తర్వాత వర్క్ లైఫ్ ప్రస్తావిస్తూ..' హిందీ, తెలుగు సినిమా పని సంస్కృతిని పోల్చి చూస్తే.. దక్షిణది పరిశ్రమలో సమయపాలన గ్రేట్. అక్కడ పని, లైఫ్ బ్యాలెన్స్ చాలా బాగుంది. ఈ విషయాన్ని వారి నుంచి మనం కచ్చితంగా నేర్చుకోవాల్సిందే. సెట్‌లోని క్రమశిక్షణ తనకు ప్రత్యేకంగా అనిపించింది. ఉదయం తొమ్మిది గంటలకు షూటింగ్‌కు వెళ్తే.. ఆరు గంటల తర్వాత అస్సలు షూట్ చేయరు. అది నిజంగా చాలా గ్రేట్. ఇక్కడ తెలుగు సినీ పరిశ్రమలో క్రమశిక్షణను అంగీకరించాల్సిన విషయం' అని తెలిపింది. కాగా.. జటాధర మూవీలో ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా కనిపించనుంది.





# మగాళ్లకు పీరియడ్స్ వస్తే..

హీరోయిన్ రష్మిక మందన్నా ఏది పట్టినా బంగారమే అవుతోంది. యానిమల్ నుంచి కుబేర వరకు ఆమె చేసిన ప్రతి సినిమా సూపర్ హిట్టే.. ఒక్క సికిందర్ తప్ప! ఈ ఏడాది రష్.. ఇప్పటివరకు నాలుగు సినిమాల(ఛావా, సికిందర్, కుబేర, థామా)తో అలరించింది. ఇప్పుడేకంగా ఐదో మూవీ 'ది గర్ల్‌ఫ్రెండ్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది.

**టాక్ షోలో రష్మిక**

రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ మూవీ నవంబర్ 7న విడుదల కానుంది. సినిమా ప్రమోషన్స్ కోసం బాగానే కష్టపడుతోందీ బ్యూటీ. ఈ మధ్యే తెలుగు బిగ్‌బాస్ తొమ్మిదో సీజన్ స్టేజీపైనా సందడి చేసింది. తాజాగా జగపతిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా షోకి హాజరైంది. ఈ టాక్ షోలో సినిమా కోసమే కాకుండా ఇతరత్రా విషయాలపైనా మాట్లాడింది.

**మగాళ్లకు పీరియడ్స్ రావాలి**

ముందుగా ఆమె మనసులో ఉన్న కోరిక గురించి జగపతిబాబు ప్రస్తావించాడు. మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని ఫీలైనట్లున్నావ్? అని అడిగాడు. అందుకు రష్మిక క్షణం ఆలోచించకుండా అవునని తలూపింది. మగాళ్లకు ఒక్కసారైనా పీరియడ్స్ వస్తే.. ఆ బాధ ఎలా ఉంటుందో అర్థం అవుతుంది అని చెప్పుకొచ్చింది. ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.



## చైతూ సరసన సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ..

# ఫస్ట్ లుక్ అదుర్స్!

తండేల్ మూవీ తర్వాత అక్కినేని హీరో నాగచైతన్య భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ మూవీ కోసం కార్తీక్ దండుతో ఆయన జతకట్టారు. చైతూ కెరీర్‌లో 24వ చిత్రంగా రానున్న ఈ సినిమాను ఎన్‌సీ24(NC24) వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. అడ్వంచరస్ మైథాలజీ చిత్రంగా రానున్న ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించి బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలో సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ అడ్వెంచరస్ మూవీలో దక్ష పాత్రలో మెప్పించనుంది. తాజాగా రిలీజైన పోస్టర్ చూస్తుంటే పురావస్తు శాఖలో శాస్త్రవేత్తగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది రిలీజైన సంక్రాంతికి వస్తున్నాం మూవీలోనూ ఐపీఎస్ ఆఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఈ సారి మరో డిఫరెంట్ రోల్‌తో అభిమానులను అలరించనున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది.

## హిందీ రిలీజ్ గురించి అడుగుతున్నారు: హీరో ఆది సాయికుమార్

"సినిమాలోని కంటెంట్ బాగుంటేనే ప్రేక్షకులు థియేటర్స్‌కు వస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్ ఉన్న మా 'శంబాల' ఏ ఒక్కరినీ నిరాశపరచదు. మా చిత్రాన్ని ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను" అని ఆది సాయికుమార్ అన్నారు. ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల: ఏ మిస్టికల్ వరల్డ్'. అర్చన అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ కీలక పాత్రలు చేస్తున్నారు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 25న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌కు మంచి స్పందన లభించిందని చిత్రబృందం పేర్కొంది. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆది సాయికుమార్ మాట్లాడుతూ– "మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన ప్రభాస్‌గారికి థ్యాంక్స్. ఈ ట్రైలర్ చూసి, రానాగారు మెచ్చుకుని, తన వంతుగా సాయం చేస్తానని చెప్పారు. కొంతమంది హిందీ రిలీజ్ గురించి అడుగుతున్నారు. ఇంకా మాకు సపోర్ట్‌గా నిలిచిన దుల్కర్, సందీప్ కిషన్, కిరణ్ అబ్బవరం, సహకరించిన నిర్మాతలు వంశీ, ప్రమోద్, ప్రసాద్ అన్నలకు ధన్యవాదాలు. రాజీపడకుండా నిర్మించిన నిర్మాతలకు లాభాలు రావాలని కోరుకుంటున్నా" అన్నారు. "థియేటర్స్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన చిత్రమిది" అని యుగంధర్ ముని చెప్పారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com